

బాబు భరోసా

- చంద్రబాబు ఐదు సంతకాలు అదుర్స్
- తొలి సంతకం మెగా డీఎస్సీ
- జిల్లా ఉద్యోగార్థుల్లో ఆనందం
- ల్యాండ్ టైటలింగ్ యాక్టు రద్దుతో కబ్జాలకు కళ్లెం
- అన్నక్యాంటీన్లతో నిరుపేదలకు ఎంతో ఉపయోగం
- కార్మికులకు ఆసరా

బాబు అంటే.. భరోసా అనే ప్రచారాన్ని నిజం చేస్తూ.. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఎన్నికల హామీల అమలుకు నడుం బిగించారు. ముఖ్యమంత్రి అయిన వెంటనే మెగా డీఎస్సీపై తొలి సంతకం చేస్తానని ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారు. ఈ మేరకు సీఎం హోదాలో సచివాలయంలో గురువారం సాయంత్రం 16,347 పోస్టుల మెగా డీఎస్సీ ఫైలుపై తొలిసంతకం చేశారు. దీంతో ఉద్యోగార్థుల్లో హర్షం వ్యక్తం అవుతోంది.

(కడప-ఆంధ్రజ్యోతి): జగన్ ఐదేళ్ల పాలనలో ఒక్క డీఎస్సీ కూడా విడుదల చేయలేదు. దీంతో చదువుకున్న వారంతా ఉద్యోగాల కోసం ఎదురుచూస్తూ ఉద్యోగాలు రాక నిరుద్యోగులుగా మారిపోయారు. సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా కూటమి అధికారంలోకి వస్తే తొలిసంతకం మెగా డీఎస్సీపైనే అంటూ చంద్రబాబు హామీ ఇచ్చారు. ఆ మేరకు తొలిసంతకం చేశారు. జిల్లాలో కూడా భారీ సంఖ్యలోనే ఉపాధ్యాయ పోస్టులు భర్తీ ఉండొచ్చని అంటున్నారు. మెగా డీఎస్సీ నిరుద్యోగులకు గొప్ప వరం. ఉన్నత చదువులు చదువుకున్న వారు జిల్లాలో వేలల్లో ఉన్నారు. జగన్ ఐదేళ్లలో ఒక్క డీఎస్సీ కూడా విడుదల చేయలేదు. కొందరికి వయోపరిమితి దాటిపోయింది. మరికొందరు వయోపరిమితికి దగ్గరలో ఉన్నారు. ఇప్పుడు చంద్రబాబు ప్రకటించిన మెగా డీఎస్సీ వారిలో ఆశలు రేపుతోంది.

ల్యాండ్ టైటలింగ్ యాక్టు రద్దు

జగన్ పాలనలో భారీ ఎత్తున భూకబ్జాలు జరిగాయి. పల్లెపట్టణం అని కాకుండా అన్నిచోట్ల విలువైన ఆస్తులు కబ్జా చేశారు. ప్రభుత్వ ప్రైవేటు ఆస్తులను కొట్టేశారు. ల్యాండ్ టైటలింగ్ యాక్టుతో కబ్జా భూములను సక్రమంగా చేసుకోవచ్చని వైసీసీ భావించింది. గత ఏడాది అక్టోబరు 31న ఏపీ భూ యాజమాన్య హక్కు చట్టం (ల్యాండ్ టైటలింగ్ యాక్టు) తీసుకువచ్చింది. ఇది అమలైతే తమ భూములు, స్థలాలు పోతాయని జనాల్లో భయం ఉండేది. జిల్లాలో కడప, ప్రొద్దుటూరు, పులివెందుల, పోరుమామిళ్ల, బద్వేలు, కమలాపురం, వేంపల్లె.. ఇలా ఎటు చూసినా విచ్చలవిడిగా భూకబ్జాలు జరిగాయి. ప్రజల ఆస్తులకు ప్రమాదకరంగా మారిన ల్యాండ్ టైటలింగ్ యాక్టును చంద్రబాబునాయుడు రెండో సంతకంతో రద్దు చేశారు. పట్టాదారు పాస్ పుస్తకాల్లో జగన్ ఫొటో వేసుకోవడం కూడా తీవ్ర విమర్శలకు తావిచ్చింది. ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దు చేస్తామని, మీ ఆస్తులు కాపాడతామని చంద్రబాబు ఇచ్చిన హామీని సాకారం చేశారు.

రూ.4వేలు పింఛను పెంపు

రూ.200 ఉన్న పింఛన్‌ను చంద్రబాబునాయుడు హయాంలోనే రూ.2వేలు చేశారు. జగన్ ఐదేళ్ల పాటు పెంచుకుంటూ పోయి రూ.3వేలు చేశారు. పింఛను రూ.4వేలకు పెంచుతామని చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు పింఛన్ల పెంపుపై మూడో సంతకం చేశారు. ఇది ఎంతో మంది పింఛనుదారులకు ఉపయోగపడనుంది. అధికారంలోకి వచ్చిన వెంటనే పింఛను రూ.4వేలు పెంచుతామని ఆ పెంపు కూడా ఏప్రిల్ వెయ్యి, మే వెయ్యి జూన్ వెయ్యి కలుపుకుని జూలైలో రూ.7వేలు ఇస్తామని హామీ ఇచ్చారు. ఆ మేరకు సంతకం చేశారు. దివ్యాంగుల పింఛన్‌ను రూ.6వేలు చేస్తామని తెలిపారు. జిల్లాలో అన్నిరకాల పింఛన్లు కలిపి 2,67,495 ఉన్నాయి. వీరందరికీ లబ్ధి చేకూరనుంది.

అన్నక్యాంటీన్లు

పేదల కోసం చంద్రబాబునాయుడు అన్నక్యాంటీన్లు ఏర్పాటు చేశారు. అన్నక్యాంటీన్‌లో పూటకు రూ.5 చొప్పున ఉదయం టిఫిన్, మధ్యాహ్నం అన్నం, రాత్రికి చపాతి.. అంటే రూ.15కే మూడుపూటలా తినేలా క్యాంటీన్లు ఏర్పాటు చేస్తున్నారు. జిల్లాలో కడప, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, బద్వేలు ప్రాంతాల్లో అన్నక్యాంటీన్లు ఏర్పాటు చేశారు. వీటి ద్వారా భవన నిర్మాణ కార్మికులు, ఇతర కూలీలు, ఆటో కార్మికులు నిరుద్యోగులు, పేదలు రూ.5కే ఆకలి తీర్చుకునేవారు. అయితే జగన్ ప్రభుత్వం కక్షగట్టి అన్నక్యాంటీన్లను రద్దు చేసింది. దీంతో కార్మికులు ఇబ్బందులు పడ్డారు. అయితే చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీ మేరకు నాలుగో సంతకం అన్నక్యాంటీన్ ఏర్పాటుపై చేశారు.

నైపుణ్యత గుర్తింపునకు.

ఇప్పటిదాకా జనగణన, కులగణన గురించే విన్నాం. ఇప్పుడు చంద్రబాబునాయుడు నైపుణ్య గణనపై సంతకం చేశారు. అంటే ఏ ఇంట్లో యువతీ యువకులకు ఎలాంటి నైపుణ్యత ఉంది అనే వివరాలన్నీ సేకరిస్తారు. ఈ మేరకు వారికి ఉపాధి కల్పించనున్నారు. కుటుంబ ఆదాయం పెరిగితే జీవన ప్రమాణాలు మారిపోతాయి. తొలిసారిగా స్కిల్ గణనను చేపట్టనున్నారు. జిల్లాలో ఎంతో మంది నైపుణ్యత గల యువతీ యువకులు ఉన్నారు. కానీ సరైన శిక్షణ ఉపాధి అవకాశాలు లేవు. ఈ సంతకం ద్వారా ప్రతి ఇంటిలోనూ ఆదాయం పెంచుకునే మార్గాలను ప్రభుత్వం కల్పించనుంది.





స్కూలు బస్సులను తనిఖీ చేస్తున్న కడప డీటీసీ మీరా ప్రసాద్



పాఠశాలలు ప్రారంభమైనా..
ఫిట్‌నెస్‌కు కదలని బస్సులు

- విద్యార్థుల తల్లిదండ్రుల ఆందోళన
- జిల్లా వ్యాప్తంగా 1,132 బస్సులు
- ఫిట్‌నెస్ పూర్తయినవి 664 మాత్రమే
- నిబంధనలు పాటించకుంటే కఠిన చర్యలు తప్పవు
- కడప రవాణాశాఖ ఉప కమిషనర్ మీరా ప్రసాద్

కడప (చిన్నచౌకు), జూన్ 13: పాఠశాలలు గురువారం పునఃప్రారంభం అయ్యాయి. విద్యార్థుల నమోదుశాతం పెంచడమే లక్ష్యంగా పెట్టుకున్న ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు స్కూలు బస్సుల ఫిట్‌నెస్‌పై దృష్టి పెట్టకపోవడంతో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఫలితంగా విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. పదిహేనేళ్లకు పైబడి కాలం చెల్లిన వాహనాలను ఇతర రాష్ట్రాల నుంచి అతి తక్కువ ధరలకు కొనుగోలు చేసి పైపైన రంగులు అద్ది రోడ్లపై తిప్పుతున్నారని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. దీనిపై రవాణాశాఖ అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో విమర్శలకు తావిస్తోంది. జిల్లా వ్యాప్తంగా 1,132 ప్రైవేటు పాఠశాలల బస్సులు ఉండగా ఇప్పటి వరకు కేవలం 664 వాటికి మాత్రమే ఫిట్‌నెస్ పరీక్షలు చేసినట్లు రవాణాశాఖ అధికారులు తెలిపారు. వీటిలో గతేడాది కొత్తగా కొనుగోలు చేసిన బస్సులు కూడా ఉన్నాయి. వీటికి రెండేళ్ల వరకు ఎలాంటి ఫిట్‌నెస్ అవసరం లేదు. ఇంకా 468 ప్రైవేటు బస్సులు ఫిట్‌నెస్ పరీక్షకు రావాల్సి ఉంది.

బస్సులకు ఏటా ఫిట్‌నెస్ సర్టిఫికెట్ (ఎఫ్‌సీ) విధిగా తీసుకోవాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఫిట్‌నెస్ పరీక్షలు కొనసాగుతున్నాయి. ఇందుకు సంబంధించి 32 నిబంధనలు ఉన్నాయి. అవి కచ్చితంగా అమలు చేస్తేనే ధ్రువీకరణ పత్రాలను అధికారులు జారీ చేస్తారు. ఏపీ వాహన చట్టం-185 ప్రకారం బస్సుకు పొందుపరిచిన నిబంధనలు పాటించాల్సిందే. లేనిపక్షంలో అటువంటి వాహనాలను సీజ్ చేస్తారు. ఫిట్‌నెస్‌కు రాని ఏవైనా కాలం చెల్లిన బస్సులు తుక్కు కింద ఉంటే అటువంటి వాటి సమాచారం ప్రభుత్వ నిబంధనల ప్రకారం రవాణాశాఖ అధికారులకు తెలపాలని లేనిపక్షంలో వాటికి సంబంధించిన ట్యాక్స్‌లు కొనసాగే అవకాశం ఉందని, భవిష్యత్తులో అధిక మొత్తంలో ప్రభుత్వానికి సంబంధిత ట్యాక్స్ రూపంలో కట్టాల్సి వస్తుందని రవాణాశాఖ అధికారులు తెలిపారు.

కఠిన చర్యలు తీసుకుంటాం..

నిబంధనలు పాటించని పాఠశాల బస్సులను ఎట్టి పరిస్థితుల్లోనూ రోడ్డు ఎక్కనివ్వం. బస్సుకు ఒక సహాయకుడు, పార్కింగ్ లైటు, చిరునామా, సెల్ నెంబరు చార్ట్ రూపంలో ఏర్పాటు చేయాలి. వాహన రిజిస్ట్రేషన్ పత్రాలు, పొల్యూషన్, బీమా పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్, ఆర్టీఏ అధికారులు జారీ చేసిన ఎఫ్‌సీ పత్రాలు బస్సులోనే అందుబాటులో ఉంచాలి. ఫిట్‌నెస్ పూర్తి కాని స్కూలు బస్సులపై కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటాం.

- మీరా ప్రసాద్, డీటీసీ, కడప



ఇన్‌చార్జ్ జడ్పీ చైర్మన్
నియామకానికి చర్యలు

కడప(రూరల్) జూన్ 13: జడ్పీ చైర్మన్‌గా ఉన్న ఆకేపాటి అమరనాథరెడ్డి ఇటీవల జరిగిన ఎన్నికల్లో రాజంపేట ఎమ్మెల్యేగా గెలుపొందారు. దీంతో జడ్పీచైర్మన్ పదవికి ఈనెల 7న ఆయన రాజీనామా చేశారు. అదేరోజున తన రాజీనామా పత్రాన్ని కలెక్టర్ విజయరామరాజుకు అందజేశారు. ఈ పరిణామంతో కొత్త జడ్పీ చైర్మన్ నియామకానికి ఎన్నిక నిర్వహించాల్సి ఉంది. అప్పటి వరకు ఇన్‌చార్జ్ చైర్మన్‌ను ఏర్పాటుచేసేందుకు కలెక్టర్ చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా ఇన్‌చార్జ్ చైర్మన్ నియామకానికి తగు జడ్పీటీసీల జాబితాను పంపాలని జడ్పీశాఖకు ఆదేశాలు వచ్చాయి. దీంతో జడ్పీ సీఈవో సుధాకర్‌రెడ్డి జడ్పీ వైస్‌చైర్మన్-1 (ప్రొద్దుటూరు జడ్పీటీసీ) జె.శారద, జడ్పీ వైస్‌చైర్మన్-2 (పెండ్లిమర్రి జడ్పీటీసీ) పిట్టు బాలయ్య పేర్లతో కూడిన జాబితాను గురువారం కలెక్టర్ పేషీకి పంపారు. ఈ జాబితాలోని ఇద్దరిలో ఒకరిని జడ్పీ ఇన్‌చార్జ్ చైర్మన్‌గా నియమించనున్నారు.

మోగిన బడిగంట

- తొలిరోజు 1.9 లక్షల మంది విద్యార్థులు హాజరు



కడప (ఎడ్యుకేషన్), జూన్ 13: జిల్లా వ్యాప్తంగా గురువారం పాఠశాలలు పునఃప్రారంభం కావడంతో బడి గంటలు మోగాయి. 2024-25 విద్యాసంవత్సరంలో విద్యార్థుల చదువులు ఆరంభమయ్యాయి. ఉదయం 9గంటలకు మొదటి బెల్ మోగింది. 9.05కు రెండో బెల్ మోగగా, ఉపాధ్యాయులు ప్రార్థనలు నిర్వహించారు. తొలిరోజు విద్యార్థులు అరకొరగా హాజరయ్యారు. జిల్లా వ్యాప్తంగా పాఠశాలలకు మొదటిరోజు 1,93,106 మంది విద్యార్థులు హాజరయ్యారు. గత ఏడాది ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు నూతన విద్యాసంవత్సరంలో నూతన తరగతిలో ప్రవేశించారు. తోటి విద్యార్థులతో సంతోషంగా గడిపారు. కొత్త తరగతి, నూతన పుస్తకాలు, బ్యాగులతో వారి ఆనందానికి అవధులు లేవని చెప్పాలి.

విద్యార్థి కిట్‌లు పంపిణీ

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు తొలిరోజే విద్యార్థి కిట్‌లను పంపిణీ చేశారు. కిట్‌లో బెల్టు, బ్యాగు, పాఠ్యపుస్తకాలు, ఒక జత షూస్, రెండు జతల సాక్స్, నోట్ పుస్తకాలు, మూడు జతల యూనిఫాం ఉంటాయి. 1 నుంచి 10 తరగతి చదివే ప్రభుత్వపాఠశాలల విద్యార్థులకు ఉచితంగా ఈ కిట్లను అందజేస్తారు.

అరకొర వసతులు

గత ప్రభుత్వంలో కొన్ని పాఠశాలల్లో నాడు నేడు పనులను ప్రారంభించారు. అయితే నిధులు సక్రమంగా విడుదల చేయకపోవడంతో ఆయా పాఠశాలల్లో పనులు నిలిచిపోయాయి. దీంతో విద్యార్థులు కొంత ఇబ్బందులు ఎదుర్కొనక తప్పలేదు. కొత్త ప్రభుత్వంలో నిధులు విడుదల చేస్తే తరగతి గదుల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేసి విద్యార్థులకు వసతులు కల్పించవచ్చని ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు.

వైఎస్సార్ కడప జిల్లాగా పేరు మార్చాలి

- తులసిరెడ్డి

వేంపల్లె/ప్రొద్దుటూరు, జూన్ 13: వైఎస్సార్ జిల్లా పేరును వైఎస్సార్ కడప జిల్లాగా మార్చాలని పీసీసీ రాష్ట్ర మీడియా చైర్మన్ నర్రెడ్డి తులసిరెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. వేంపల్లెలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వెంకటేశ్వరస్వామి తొలిగడపగా కడప పేరుప్రఖ్యాతి చెందిందన్నారు. జిల్లా పేరులో కడప ఉంటేనే బాగుంటుందన్నారు. 2009 వైఎస్ మరణానంతరం ఏర్పడిన రాష్ట్ర ప్రభుత్వం కడప జిల్లా పేరును వైఎస్సార్ కడప జిల్లాగా మార్చిందన్నారు. జగన్ కొలువుదీరాక ఇందులోని కడప తొలగించి వైఎస్సార్ మాత్రమే ఉంచారన్నారు. పేరు మార్చాలని తాము గట్టిగా కోరినప్పటికీ జగన్ పట్టించుకోలేదన్నారు. టీడీడీ ప్రభుత్వమైనా వైఎస్సార్ కడప జిల్లాగా పేరు మార్చి జిల్లా ప్రజల ఆకాంక్షను నెరవేర్చాలని ఆయన కోరారు.

జిల్లాకు కడప పేరును తొలగించి జగన్ చారిత్రక ద్రోహం తలపెట్టాడని ఏపీ విభజన హామీల ప్రత్యేక హోదా సాధన సమితి అధ్యక్షుడు డాక్టర్ పాతకోట శ్రీనాధ్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆయన ప్రొద్దుటూరులో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి జిల్లాల పునర్వ్యవస్థీకరణలో భాగంగా వైఎస్సార్ కడప జిల్లాకు ఉన్న పేరులో కడప తొలగించి తప్పుచేశారన్నారు. కొత్తగా ఏర్పడిన టీడీపీ ప్రభుత్వం దీనిని సరిచేయాలన్నారు.

డీసీసీబీ చైర్‌పర్సన్ రాజీనామా

- డీసీసీబీకి వాట్సాప్ ద్వారా రాజీనామా లేఖ

కడప(రూరల్), జూన్ 13: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు బుధవారం ఆప్కాబ్ చైర్‌పర్సన్ పదివికి రాజీనామా చేసిన ఎం.ఝాన్సీరాణి గురువారం డీసీసీబీ చైర్‌పర్సన్ పదవికి కూడా రాజీనామా చేశారు. ఈ మేరకు రాజానామా పత్రాన్ని ఉదయం 11 గంటల ప్రాంతంలో వాట్సాప్ ద్వారా కడప జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ)కు పంపారు. దీంతో ఇన్‌చార్జ్ సీఈవో రాజామణి డీసీసీబీ చైర్‌పర్సన్ పంపిన రాజీనామా లేఖను కో-ఆపరేటివ్ కమిషనర్ కార్యాలయానికి, జిల్లా కో-ఆపరేటివ్ శాఖ కార్యాలయానికి పంపారు. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత డీసీసీబీ పాలకమండలికి ఎన్నికలు నిర్వహించకుండా త్రిమెన్ కమిటీని ఏర్పాటు చేసి చైర్మన్ పదవులను నామినేటెడ్ పద్ధతిన కట్టబెట్టారు. జూలై 2021న ఎం.ఝాన్సీరాణి డీసీసీబీ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు చేపట్టారు. ఈమె దాదాపు మూడు సంవత్సరాలు ఈ పదవిలో కొనసాగారు. వైసీపీ ఘోరంగా ఓడిపోయి ఎన్డీయే కూటమి రాష్ట్రంలో అధికారం చేపట్టింది. ఈ నేపథ్యంలో ఝాన్సీరాణి తన పదవీకాలం ఇంకా జూలై 17వ తేదీ వరకు ఉన్నప్పటికీ నెలముందుగానే రాజీనామా చేసేశారు.

ఏడుగురు డీసీసీబీ డైరెక్టర్ల రాజీనామా

కడప జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) పాలకమండలి డైరెక్టర్లు ఏడుగురు రాజీనామా చేశారు. వీరిలో ప్రొద్దుటూరు మండలం లింగాల సహకార సొసైటీ అధ్యక్షురాలు(డీసీసీబీ చైర్‌పర్సన్) ఝాన్సీరాణి, రాజామణి (ప్రొద్దుటూరు), అంజనేయులు (వేల్పుల), వెంకట్రామిరెడ్డి (సంబేపల్లె), ఉసేన్‌పీర (దేవుని కడప), వెంకటసుబ్బారెడ్డి (నల్లింగాయపల్లె), గంగాద్రి (చిట్వేలి).. మొత్తం ఏడుగురు డైరెక్టర్లు రాజీనామా చేశారు. ఈ మేరకు రాజీనామా పత్రాలను డీసీసీబీ కార్యాలయానికి పంపారు.



ప్రభుత్వం మారినా.. ఆగని
ఇసుక అక్రమ రవాణా

- పెన్నానదిని గుల్లచేస్తున్న ఇసుకాసురులు
- ప్రత్యేక ఇసుక నియంత్రణ టీములు ఏవీ..?
- అధికార యంత్రాంగంలో కానరాని మార్పు
- పట్టించుకోని అధికారులు

నిన్నటి వరకు వైసీపీ ప్రభుత్వంలో పెన్నానదిలో ఇసుక అక్రమంగా తవ్వకాలు జరిపి యథేచ్ఛగా ట్రాక్టర్లతో తరలించేవారు. ఈ ఐదేళ్లలో వందల కోట్లు ఇసుకలో అక్రమంగా వైసీపీ వాళ్లు సంపాదించారు. ఇప్పుడు ప్రభుత్వం మారింది. ముఖ్యమంత్రిగా సుదీర్ఘ అనుభవం గల చంద్రబాబు నాయుడు బాధ్యతలు చేపట్టారు. కానీ అధికార యంత్రాంగంలో ఏ మార్పు కానరావడంలేదు.

ప్రొద్దుటూరు, జూన్ 13: నిన్నటి వైసీపీ ప్రభుత్వంలో మాదిరే ఇప్పటికీ ఇసుక అక్రమరవాణాకు అధికారులు సహకరించి జేబులు నింపుకుంటున్నారనే ఆరోపణలు కొనసాగుతున్నాయి. ప్రభుత్వం మారితే మాకేంటి.. వచ్చే ఆదాయం మానుకుంటామా అనే తీరులో ఇక్కడి రెవెన్యూ , పోలీసు, సెబ్ అధికారులు ఇసుక దందా విషయంలో వ్యవహరిస్తున్నారు. ప్రొద్దుటూరులో ఇసుక భూదందాలను అరికడతానన్న ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డి ఇంకా రంగంలోకి దిగలేదు. దీంతో ఇదే అదనుగా ఇసుకాసురులు రెచ్చిపోతున్నారు.


ఏరియాలను పంచుకుని..

ఏరియాలను పంచుకుని, వాటాలేసుకుని ఇసుకాసురులు పెన్నానదిలో అక్రమ తవ్వకాలు సాగిస్తున్నారు. ఇందులో భాగంగా మీ ఏరియాలో మీరు తవ్వుకోండి.. మా ఏరియాలో మేమే తవ్వుకుంటాము అని ఒప్పందాలు సాగుతున్నాయి. కొందరు వీటిని అధిగమించి మరో ప్రాంతంలో ఇసుక తవ్వకాలు జరుపుతుంటే దాడులకు సైతం తెగబడుతున్నారు. ఇంతా జరుగుతున్నా పోలీసులు, సెబ్, రెవెన్యూ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు.

ప్రత్యేక టీంల జాడేదీ..

తహశీల్దారు విద్యాసాగర్ ఇసుక అక్రమ రవాణా నియంత్రణకు ప్రత్యేకంగా రెవెన్యూ పోలీసు యంత్రాంగంతో టీంలు వేసి అరికడతానని చెప్పి రోజులు గడుస్తున్నాయి. కానీ అమలుకు నోచుకోవడం లేదు. పత్రికల్లో కథనాలు వచ్చినప్పుడు టీంలు వేసి అరికడతాం అని ప్రకటనలు ఇవ్వడం తప్ప చర్యలు కార్యరూపం దాల్చడం లేదు. అంతేకాకుండా నదిలోకి ఇసుక ట్రాక్టర్లు వెళుతున్న మార్గాలను గుర్తించి ఆ ప్రాంతంలో గుంతలు కొట్టి ట్రాక్టర్లు నదిలోకి వెళ్లకుండా చర్యలు తీసుకుంటామని రెవెన్యూ అధికారులు చెప్పారు. అదీ కార్యరూపం దాల్చలేదు. దీంతో ఇదే అదనుగా ఇసుక మాఫియా ఏరియాలను పంచుకుని మరీ తవ్వకాలు సాగిస్తోంది. యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా సాగుతూనే ఉంది. ఇప్పటికైనా అధికార యంత్రాంగం మొద్దునిద్ర వీడి చర్యలకు ఉపక్రమిస్తారా ఇంకా కొన్ని రోజులు పాటు వచ్చే తమ అక్రమ ఆదాయన్ని మిస్ కాకుండా ఇసుక దందాను సాగనిస్తారా వేచిచూడాలి.

ఇసుక అక్రమ రవాణా నియంత్రణకు చర్యలు చేపట్టకపోవడంతపై తహశీల్దారు విద్యాసాగర్‌ను వివరణ కోరడానికి ప్రయత్నించగా ఆయన ఫోన్‌లో అందుబాటులోకి రాలేదు. డిప్యూటీ తహశీల్దారు కార్యాలయ సూపరిండెంట్ సాయినాథరెడ్డిని వివరణ కోరగా ఎన్నికల ప్రక్రియ కౌంటింగ్ పనుల్లో ఉండటం వలన పూర్తి స్థాయిలో నిఘా ఉంచలేక పోయామని అన్నారు. టీంలు అయితే వేశామని వారికి నేటి నుంచి బాధ్యతలు అప్పగించి నదిలోకి ట్రాక్టర్లు వెళ్లే మార్గాలలో గుంతలు తీసి అక్రమ రవాణాను అడ్డుకుంటామన్నారు. పోలీసులకు కూడా తహశీల్దారు ఉత్తర్వులు పంపి ఆదేశించారని వారూ తీసుకుంటారన్నారు.





ఎర్రగుంట్ల బైపాస్ రోడ్డులో ట్రాక్టర్లలో అక్రమంగా తరలిస్తున్న ఇసుక

పెళ్లి చేసుకోమన్నాడని..

- తండ్రిని హత్య చేసిన కూతురు

మదనపల్లె అర్బన్, జూన్ 13: తనకు ఇష్టం లేని పెళ్లి చేసుకోమని చెప్పాడని కన్న తండ్రినే ఓ కూతురు దారుణంగా హత్య చేసిన సంఘటన బుధవారం రాత్రి మదనపల్లెలోని పీఅండ్‌టీ కాలనీలో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. సదుం మండలం చెరుకువారిపల్లెకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఇ.దొరస్వామి (62) కుటుంబసభ్యులతో కలిసి మదనపల్లెలో స్థిరపడ్డారు. ఈ క్రమంలో దొరస్వామి స్థానిక పీఅండ్‌టీ కాలనీలో సొంతంగా ఇల్లు నిర్మించుకుని దిగువ కురవంకలోని ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. జూలైలో ఆయన పదవీ విరమణ చేయాల్సి ఉంది. ఆయన భార్య లత ఏడాదిన్నర ఏళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. బీఎస్సీ, బీఎడ్ చదివిన కుమార్తె హరితతో కలసి దొరస్వామి నివాసం ఉంటున్నారు. పెళ్లి విషయమై తండ్రి, కూతురుకి కొద్దిరోజులుగా గొడవలు జరుగుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. ఇటీవలే తన కుమార్తెకు పెళ్లి చేయడానికి సంబంధాలు చూశారని, అయితే అబ్బాయి ఆమెకు నచ్చలేదని చెప్పి తండ్రితో గొడవపడుతున్నట్లు సమాచారం. అయితే హరిత కొందరితో చనువుగా ఉన్నట్లు చెబుతున్నారు. ఇందులో భాగంగా ఒకరికి రూ.10 లక్షలు ఇచ్చినట్లు స్థానికులు పోలీసులకు చెప్పారు. అలాగే తండ్రిపై ఒత్తిడి తెచ్చి వారు నివాసం ఉన్న ఇంటిని కూడా తన పేరున రిజిస్ట్రేషన్ చేయించుకుంది. ఇంతలోనే ఏమైందో తెలీదు కానీ బుధవారం రాత్రి 11.45 గంటల ప్రాంతంలో ఇంట్లో నుంచి అరుపులు, కేకలు వినపడటంతో చుట్టుపక్కల వారు ఇంటి వద్దకు చేరుకుని చూడగా అప్పటికే ఉపాధ్యాయుడు రక్తపు మడుగులో ఉన్నట్లు గుర్తించారు. స్థానికుల సమాచారం మేరకు మదనపల్లె వన్‌టౌన్ సీఐ వల్లీబసు అక్కడికి చేరుకుని సంఘటనాస్థలాన్ని పరిశీలించారు. అక్కడే ఉన్న హరితను విచారించగా మొదట్లో పొంతన లేని సమాధానం చెప్పినా తరువాత నేరాన్ని అంగీకరించింది. అట్ల కాడతో తలపై బలంగా మోది హత్య చేసినట్లు ఒప్పుకుంది. దీంతో నిందితురాలిని వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌కు తరలించారు. హత్య జరిగిన ఇంటిని, పరిసరాలను మదనపల్లె డీఎస్పీ ప్రసాద్‌రెడ్డి సందర్శించారు. ప్రియుడి వైపు నుంచి కూడా కేసును దర్యాప్తు చేస్తున్నారు. హతుడి బంధువు డాక్టర్ నారాయణయ్య ఫిర్యాదు మేరకు హరితపై హత్య కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు సీఐ తెలిపారు.

సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ ప్రసాద్‌రెడ్డి



తిరుమల ఎక్స్‌ప్రెస్ రైలు నెంబరు మార్పు

కడప (ఎడ్యుకేషన్), జూన్ 13: తిరుమల ఎక్స్‌ప్రెస్ రైలు నెంబర్లు జూలై 1 నుంచి మార్చనున్నట్లు కడప రైల్వేచీఫ్ టికెట్ ఇన్‌స్పెక్టరు ఉమర్‌బాషా తెలిపారు. కడప, విశాఖపట్టణం మీదుగా వెళ్లే ఈ రైలు ప్రస్తుతం 17487 /17488 నెంబర్లతో నడుస్తోందన్నారు. జూలై 1 నుంచి ఈ రైలు 18521/18522 నెంబర్లతో నడవనున్నట్లు తెలిపారు. ప్రయాణికులు ఈ విషయాన్ని గ్రహించాలని కోరారు.



అడ్డగోలుగా పనులు... రూ.లక్షల్లో అవినీతి

- పనులు చేయకుండా నిధులు మింగేసిన వైనం
- చేసిన పనులు మళ్లీ చేసి దోపిడీ
- రైల్వేకోడూరు పంచాయతీలో వైసీపీ నేతల దందా

రైల్వేకోడూరు, జూన్ 13: మేజర్ పంచాయతీ అయిన రైల్వేకోడూరులో వైసీపీ నేతలు అడ్డగోలుగా పనులు చేపట్టి లక్షలాది రూపాయల నిధులను మింగేశారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఇష్టానుసారం పనులు చేపట్టి పంచాయతీ నిధులు బొంచేశారని ఆరోపణలు గుప్పుమంటున్నాయి. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో పంచాయతీ నిధులతో రోడ్డు మీద రోడ్డు వేసి తిమింగళాల్లా తినేశారని టీడీపీ వార్డు సభ్యులు గగ్గోలు పెట్టినా అప్పట్లో పట్టించుకునే వారే కరువయ్యారు..

రైల్వేకోడూరు మేజర్ పంచాయతీకి 2021లో ఎన్నికలు జరిగాయి. సుమారు మూడున్నర సంవత్సరాల కాలంలో ఎన్నో అవినీతి పనులు చేశారని... అప్పట్లో టీడీపీ వార్డు సభ్యులు ఆందోళన చేసినా వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. రైల్వేకోడూరు పట్టణ సుందరీకరణ కోసం ఏపీఎండీసీ రూ.33లక్షల నిధులు కేటాయించి పంచాయతీకి బదలాయించింది. ఈ పనులు తూతూ మంత్రంగా చేసి నిధులు గోల్‌మాల్ చేశారు. రైల్వేకోడూరు ప్రధానదారికి మధ్యలో డివైడర్‌కు గతంలో ఉన్న ఇనుప గ్రిల్స్, నిర్మాణం చేసిన గోడలను తొలగించారు. మళ్లీ డివైడర్‌పై గోడ నిర్మాణం చేశారు. మధ్యలో మొక్కలు నాటడానికి మట్టి పోశారు. నాసిరకం మొక్కలు నాటడడంతో మొక్కలు కూడా చాలా వరకు చనిపోయాయి. ఇక గత కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉండగా డివైడర్లను సుందరీకరణ చేశారు. మధ్యలో బట్టర్‌ఫ్లై లైటింగ్ ఏర్పాటు చేశారు. కొత్తగా సుందరీకరణలో భాగంగా పాత స్తంభాలకే మెరుగులు దిద్ది లైట్లు మాత్రమే ఏర్పాటు చేసి బిల్లులు చేసుకున్నారని ఆరోపణలు ఉన్నాయి. పంచాయతీ నిధులతో క్రిష్ణానగర్ ప్రాంతంలో రోడ్డు మీద రోడ్డు వేశారు. ఇక ఇంటి ప్లాన్ అప్రూవల్‌కు సంబంధించి అవినీతి ఆరోపణలు తీవ్రంగా విని పిస్తున్నాయి. వైసీపీ అధికారంలోకి వచ్చాక సర్పంచ్, ఉప సర్పంచ్‌తో పాటు ఇంజినీర్లు కూడా ఇంటి ప్లానింగ్ అప్రూవల్‌లో చాలా వరకు నొక్కేశారని బాధితులు ఆరోపించారు. ఇక అధికారం చేతిలో ఉంది కదా అని ఇష్టానుసారం 10కి పైగా కాంట్రాక్టు ఉద్యోగాలు ఇచ్చారని టీడీపీ వార్డు సభ్యులు గతంలో వాదించారు. పని లేకపోయినా కాంట్రాక్టు కింద సిబ్బందిని పెట్టుకున్నారని ఆరోపణలు వచ్చినా వైసీపీ ప్రభుత్వం, నేతలు పట్టించుకో లేదు. కొత్తగా కాంట్రాక్టు పనిలో పెట్టుకున్న వారు పనులు సక్రమంగా చేయరు. ప్రతి రోజు వచ్చి కార్యాలయంలో ప్రజెంట్ వేయించుకుని ప్రతినెల రూ.13,600లు జీతాలు తీసుకుంటున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. పంచాయతీలో జరిగిన అవినీతిపై ఉన్నత స్థాయి కమిటీ వేసి నిగ్గుతే ల్చాలని పలువురు కోరుతున్నారు.

రికార్డులు తారుమారు..

పంచాయతీలో జరిగిన గోల్‌మాల్ వ్యవహారాలు, నిధుల స్వాహ తదితర వాటి రికార్డులను ఎన్నికలకు ముందుగానే తారుమారు చేశారని తెలిసింది. ఈ విషయం బయటకు రానివ్వకుండా చేస్తున్నారని తెలుస్తోంది. ఇక రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రైల్వేకోడూరు ఉపసర్పంచ్ తోట శివసాయి అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. ఎక్కడ ఉండేది కూడా పంచాయితీ అధికారులకు అందుబాటులోకి రాలేదు. కోడూరు పంచాయతీలో జరుగుతున్న తతంగం గురించి వివరణ కోరేందుకు ఆంధ్రజ్యోతి ఉప సర్పంచ్‌కి ఫోన్ చేయగా ఎత్తలేదు.

అన్నీ సక్రమంగానే జరిగాయి..

కోడూరు పంచాయితీలో అవినీతి ఏమీ జరగలేదని కార్యదర్శి డీవీ ప్రసాద్‌రావు తెలిపారు. రికార్డులు ఎక్కడ తారుమారు కాలేదన్నారు. రికార్డులు సక్రమంగా ఉన్నాయని, పనులు సక్రమంగానే జరిగాయని వివరించారు.



క్రిష్ణానగర్ ప్రాంతంలో రోడ్డు మీద రోడ్డు వేసిన దృశ్యం, ఏపీయండీసీ నిధులతో నాటిన మొక్క చనిపోయిన దృశ్యం, మిగిలిన మొక్కలు నాటని వైనం, పాత స్తంభానికే రంగులు వేసిన దృశ్యం

స్టూడెంట్స్ కిట్స్ పంపిణీ

- స్టాక్ పాయింట్ పరిశీలించిన డీఈవో



స్టూడెంట్స్ కిట్స్ విద్యార్థులకు పంపిణీ చేస్తున్న డీఈవో శివప్రకాశ్‌రెడ్డి

చిన్నమండెం, జూన్ 13: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం స్టూడెంట్ కిట్స్‌ను విద్యార్థులకు డీఈవో శివప్రకాశ్‌రెడ్డి పంపిణీ చేశారు. మిగిలిన పాఠశాలలకు కూడా కిట్స్‌ను త్వరగా అందించాలని మండల విద్యాశాఖాధికారి అంజనేయులునాయుడును ఆదేశించారు. చిన్నమండెం మండల కేంద్రంలోని స్టూడెంట్స్ కిట్స్ స్టాక్ పాయింట్‌ను డీఈవో ఆకస్మికంగా తనిఖీ చేసి మండల వ్యాప్తంగా వివిధ పాఠశాలలకు పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ పంపిణీ వివరాలను మండల విద్యాశాఖాధికారిని అడిగి తెలుసుకున్నారు. అలాగే మిగిలిన పాఠశాలకు కూడా త్వరగా పంపిణీ చేయాలని ఆదేశించారు. అనంతరం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలను సందర్శించి స్టాఫ్ మీటింగ్‌లో పాఠశాల ఉత్తీర్ణత, అడ్మిషన్‌ల వివరాలను అడిగి తెలుసుకుని పాఠశాలలో ప్రవేశాలు పెరిగే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం డీఈవో చేతుల మీదుగా విద్యార్థులకు స్టూడెంట్స్ కిట్స్ అందించారు. కార్యక్రమంలో ఎంఈవో శివానాయక్, హెచ్ఎం రమాదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

JAMMALAMADUGU NAGAR PANCHAYAT
'e' Procurement Tender Notice No. 01 to 02 / 2024-24 / General / E1, Dt: 13.06.2024

General Fund Grant – 2 Work – Rs.5.00 Lakhs
Bid Document Downloading Start Time 13.06.2024 @ 10.00 PM.
Bid document downloading end date: 20.06.2024 @ 3.00 PM.
Last date / Time of receipt of Tender: 20.06.2024 @ 3.30 PM.
Price Bid opening dated: 20.06.2024 @ 4.00 PM.
Contact: Further details can be seen @ 'e' Procurement market place @ **https://www.tender.apeprocurement.gov.in,** Deputy Executive Engineer, Contact No. 7207439643

MUNICIPAL COMMISSIONER, NAGAR PANCHAYAT, JAMMALAMADUGU.

విద్యుదాఘాతంతో మహిళ మృతి



రమణమ్మ మృతదేహం

కాశినాయన, జూన్ 13: మండలంలోని అమగంపల్లెలో విద్యుదాఘాతంతో రమణమ్మ (46) అనే మహిళ మృతి చెందింది. స్థానికుల వివరాల మేరకు.. గ్రామానికి చెందిన బుర్ర సుబ్బయ్య భార్య రమణమ్మ గురువారం సాయంత్రం చింతచెట్టు ఎక్కి చింతాకు కోస్తుండగా కరెంట్ షాక్‌తగిలి చెట్టు పైనుంచి కిందపడి అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలికి నలుగురు సంతానం కలరు. గతంలో కూడా ఇదే చింత చెట్టువద్ద కరెంట్ షాక్‌తో పశువు కూడా మృతి చెందినట్లు గ్రామస్తులు తెలి పారు. విషయం ట్రాన్స్‌కో అధికారులకు తెలియపరిచినా పట్టించకోలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆమేరకు విషయాన్ని పోలీసులకు తెలియపరిచామన్నారు.

కారు, ద్విచక్రవాహనం ఢీ- ముగ్గురికి తీవ్రగాయాలు



ప్రమాదంలో గాయపడిన వారు

చిన్నమండెం, జూన్ 13: మండలంలోని కేశాపురం గ్రామ పంచాయతీ కేశాపురం రైతు భరోసా కేంద్రం వద్ద కారు ద్విచక్రవాహనాన్ని ఢీకొనడంతో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల వివరాల మేరకు.. గుర్రంకొండ మండలం నడిమికండ్రిక గ్రామం చింతమేకలపల్లెకు చెందిన ఒక మహిళ తన కుమారుడు, కుమార్తెతో కలసి ద్విచక్రవాహనంలో చిన్నమండెం నుంచి స్వగ్రామం వెలుతోంది. అదే సమయంలో మదనపల్లె వైపు నుంచి చిన్నమండెం వైపు వెళుతున్న కారు కేశాపురం రైతు భరోసా కేంద్రం వద్దకు వచ్చేసరికి ద్విచక్రవాహనాన్ని ఢీకొనడంతో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. కాళ్లు విరిగి ఎముకలు బయటికి రావడంతో క్షతగాత్రులను 108 వాహనంలో రాయచోటి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ డాక్టర్ల సూచన మేరకు వారిని వెంటనే తిరుపతికి తరలించినట్లు స్థానికులు తెలిపారు. ఎస్ఐ రమేశ్‌బాబును వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు రాలేదని తెలిపారు.

పోలీసుస్టేషన్‌కు చేరిన స్థల వివాదం

- వైసీపీ నేతలు స్థల ఆక్రమణపై బాధితుడితో కలసి టీడీపీ నేతల ఫిర్యాదు



కడప (క్రైం), జూన్ 13: కడప నగ రం మద్రాసు రోడ్డులోని రాజేశ్వరి కళ్యాణ మండపం పక్కన ఉన్న రోడ్డు స్థల వివాదం పోలీసు స్టేషన్‌కు చేరింది. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు కొంత మంది వైసీపీ నేతలు తన స్థలాన్ని కబ్జా చేసి కంచె ఏర్పాటు చేశారని గురువారం స్థల యజమాని నాగేశ్వర్‌రావుతో పాటు టీడీపీ నేత లు రిమ్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుడి వివరాల మేరకు.. వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నపుడు వైసీపీకి నాయకులు తమ స్థలాన్ని ఆక్రమించుకుని కంచె ఏర్పాటు చేశారన్నారు. తాను కోర్టు నుంచి ఆ స్థలానికి సంబంధించి స్టే ఆర్డరు తెచ్చుకున్నప్పటికీ.. అప్పట్లో వైసీపీ నేతలు తనను స్థలంలోకి అడగుపెట్టకుండా అడ్డుకున్నారన్నారు. గురువారం స్థలానికి సంబంధించి కంచెను తొలగించి డాక్యుమెంట్లతో బాధితుడు నాగేశ్వర్‌రావుతో పాటు టీడీపీ నేతలు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రిమ్స్ సీఐ రామచంద్ర ఇరువర్గాలను పిలిపించి వారి డాక్యుమెంట్లు తెప్పించుకున్నారు. ఈ విషయమై రిమ్స్ సీఐని వివరణ కోరగా.. ఇరువర్గాలను పిలిపించి డాక్యుమెంట్లు పరిశీలించడంతో పాటు కడప తహసీల్దారుకు పరిశీలనకు పంపించామని తెలిపారు.

యువతిపై హత్యాయత్నం.. ఆపై యువకుడి మృతి

- విచారిస్తున్న పోలీసులు



మృతి చెందిన సాయికుమార్‌రెడ్డి



మంటలను అదుపుచేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

బద్వేలుటౌన్/ అట్లూరు, జూన్ 13: ఓ యువతితో నాలుగు సంవత్సరాలు ప్రేమవ్యవహారం నడిపిన యువకుడు అనుమానాస్పస్థితిలో మృతి చెందిన సంఘటన బద్వేలు పట్టణంలో చోటుచేసుకుంది. గురువారం ఉదయం అట్లూరు మండలంలోని లింగాలకుంట్లలో ఉన్న రైతు భరోసా కేంద్రంలో యువతి విధులు నిర్వహిస్తుండగా.. ఆమెపై సాయి కుమార్‌రెడి (27) అనే యువకుడు పెట్రోలు పోసి, తనపై పెట్రోలు పోసుకొని నిప్పంటించుకునేందుకు యత్నించాడు. గమనించిన రైతు భరోసా కేంద్రంలోని సహోద్యోగులు అడ్డుకోవడంతో యువకుడు వెను తిరిగాడు. అక్కడి నుంచి బద్వేలు పట్టణంలోని సిద్దవటం రోడ్డులో ఉన్న తన అక్క ఇంటికి వెళ్లి అగ్నికి ఆహుతై మృతి చెందాడు. కాగా, యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడా.. లేదా ప్రమాదవశాత్తు నిప్పంటుకుని మృతి చెంది ఉంటాడా అన్న కోణంలో పోలీసులు విచారణ చేపట్టారు. వివరాల్లోకి వెళితే..

మండల కేంద్రమైన కలసపాడు గ్రామానికి చెందిన పాముూరి బాలిరెడ్డి, వెంకటసుబ్బమ్మలకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె కలరు. అందులో చిన్నవాడైన సాయికుమార్‌రెడ్డి పోరుమామిళ్ల, గోపవరం మండలంలో 108 అంబులెన్స్ వాహనానికి డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. బద్వేలు పట్టణం సిద్దవటం రోడ్డులోని తన అక్క సరస్వతి ఇంట్లో ఉండేవాడు. కాగా సాయికుమార్‌రెడ్డికి అదే మండలానికి చెందిన ఓ యువతితో ప్రేమ వ్యవహారం నడుస్తుండేది. అయితే ఆ యువతి అట్లూరు మండలంలోని రైతు భరోసా కేంద్రంలో ఉద్యోగం చేస్తుండేది. అయితే వీరిద్దరి మధ్య ఏమైందో ఏమో తెలియదుకానీ గురువారం ఉదయం రైతు భరోసా కేంద్రం వద్ద ప్రేమించిన యువతిపై పెట్రోలు పోసి తనపై పెట్రోలు పోసుకొని సాయి కుమార్‌రెడ్డి నిప్పంటించుకోవడానికి ప్రయత్నించాడు. అక్కడ ఉన్న సహోద్యోగులు అడ్డుకోవడంతో వెంటనే వెనుతిరిగి బద్వేలు పట్టణానికి వచ్చాడు. వచ్చిన కొద్ది సమయానికి సిద్దవటం రోడ్డులోని మృతుడు ఉన్న ఇంట్లో నుంచి మంటలు చెలరేగి పొగలు రావడంతో స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి, పోలీసులకు సమాచారం అందించారు. అలాగే ఆ ఇంటికి కొద్ది దూరంలో మృతుడి అక్క మగ్గం వర్క్‌చేస్తూ దుకాణం నిర్వహిస్తుండేది. మృతుడు అక్క సంఘటనా స్థలానికి చేరుకుంది. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపుచేస్తున్న సమయంలో కాలిపోయిన మృతదేహాన్ని గుర్తించారు. సాయికుమార్‌రెడ్డి ఇంటికి వచ్చిన విషయం మృతుడి అక్కకు తెలియకపోవడంతో ఇంట్లో ఎవరూ లేరనుకున్నారు. కానీ మృతుడు సాయికుమార్‌రెడ్డికి ప్రమాదవశాత్తు నిప్పంటుకుందా? లేదా ఆత్మహత్యకు పాల్పడ్డాడా అనేది తెలియడం లేదు. కాగా మృతుడు ప్రేమించిన యువతి కొండూరు పోలీస్‌స్టేషన్‌లో సాయికుమార్‌రెడ్డి రైతు భరోసా కేంద్రం వద్ద తనపై పెట్రోలు పోసి దాడి చేసినట్లు ఫిర్యాదు చేసింది. అలాగే మృతుడు తండ్రి బాలిరెడ్డి ఫిర్యాదు మేరకు ప్రేమ వ్యవహారంతోనే తన కుమారుడు సాయికుమార్‌రెడ్డి మృతి చెందాడని బద్వేలు అర్బన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు వివిధ కోణాల్లో విచారణ చేపట్టారు. మృతికిగల కారణాలు పోలీసు విచారణలో తెలియాల్సి ఉంది.

హుండీ ఆదాయం రూ.46.33 లక్షలు



బ్రహ్మంగారిమఠం ఆలయ ప్రాంగణంలో హుండీని లెక్కిస్తున్న భక్తులు

బ్రహ్మంగారిమఠం, జూన్ 13: ప్రముఖ పుణ్యక్షేత్రమైన బ్రహ్మంగారిమఠం ఆలయ ప్రాంగణంలో గురువారం దేవదాయశాఖ అసిస్టెంటు కమిషనర్, ప్రస్తుత ఆలయ ఫిట్‌పర్సన్ సి.శంకరబాలాజీ పర్యవేక్షణలో హుండీ ఆదాయాన్ని లెక్కించారు.

వీరబ్రహ్మేంద్రస్వామికి భక్తులు సమర్పించిన కానుకలను పూర్వపు మఠాధిపతుల కుటుంబ సభ్యుల అధ్యక్షతన ఆరు హుండీలను మూడు నెలలకు సంబంధించి లెక్కించగా రూ.46,33,057 నగదు, 36 గ్రాములు బంగారు, 640 గ్రాములు వెండి ఉన్నట్లు ఆలయ మేనేజరు ఈశ్వరయ్య ఆచారి తెలిపారు. కార్యక్రమంలో కర్నూలు జేఈఓ పాండురంగారెడ్డి, పూర్వపు మఠాధిపతి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డుప్రమాదంలో మహిళ మృతి

గుర్రంకొండ, జూన్ 13:ఆటోను ట్రాక్టర్ ఢీకొనడంతో సునీత(30)మహిళ మృతి చెందిన సంఘటన మామిళ్లవారిపల్లె సమీపంలో బుధవారం రాత్రి జరిగింది. పోలీసుల వివరాల మేరకు గుర్రంకొండ మండలంలోని చెర్లోపల్లె పంచాయతీ ఎగువకమ్మ పల్లెకు చెందిన ఎ.రాంమోహన్, సునీత దంపతులు గుర్రంకొండలో కాపురముంటూ పెద్దమండ్యం మం డలం తురకపల్లెలో టమోటా నర్సరీని నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం రాత్రి వర్షం కురవడంతో ఆటోలో గుర్రంకొండకు బయలుదేరారు. వారు ప్రయాణిస్తున్న ఆటోను మామిళ్లవారిపల్లె సమీపంలోని డంపింగ్ యార్డు వద్ద మార్కెట్ యార్డు నుంచి పెద్దమండ్యం వైపు వెళ్లుతున్న ట్రాక్టర్ ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న సునీత తలకు ట్రాక్టర్ ట్రాలీ తగలడంతో తీవ్ర రక్తగాయమైంది. వెంటనే ఆమెను 108 వాహనంలో మదనపల్లె ప్రభుత్వ ఆసుప త్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం బెంగుళూరుకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెం దినట్లు ఎస్ఐ తెలిపారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమితం వాల్మీకీపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఆయ న తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ట్లు ఎస్ఐ నాగార్జునరెడ్డి తెలిపారు. మృతురాలికి ఇద్దరు చిన్నపి ల్లలున్నారు. దీంతో గ్రామంలో విషాధచాయాలు అలుముకు న్నాయి.

భక్తుల కల్పవల్లి నాగారపమ్మ

- రేపటి నుంచి తిరుణాల ప్రారంభం
- ఏర్పాట్లు చేస్తున్న నిర్వాహకులు



నాగారపమ్మ ఆలయం, ప్రత్యేక అలంకరణలో నాగారపమ్మ

సుండుపల్లె, జూన్ 13: భక్తుల కోర్కెలు తీర్చే నాగారపమ్మ తల్లి ఆడ వాళ్లకు బిడ్డలను ప్రసాదించే శక్తి గల అమ్మగా పేరుంది. దశాబ్దాల కాలం నాటి చరిత్ర కలిగిన నాగారపమ్మ మండల పరిధిలోని పెద్దినేని కాలువ పంచాయతీ బండకాడ ఈడిగపల్లె గ్రామంలో బాహుదానది పరివాహ ప్రాంత సమీపంలో వెలిసి.. భక్తుల పాలిట కొంగు బంగారమై పూజలందుకుంటోంది. ఈ ఏడాది మూడు రోజుల పాటు తిరుణాళ్ల మహోత్సవం నిర్వహించేందుకు ముమ్మరంగా ఏర్పాటు చేస్తున్నారు. ఈ నెల 15వ తేదీ శనివారం ప్రత్యేక పూజలతో పాటు కుంకుమార్చన, హోమాలు నిర్వహిస్తారు. 16న ఆదివారం ఉదయం పుట్టను అలంకరించి పుట్ట నుంచి పుట్టమన్ను బంగారం తెచ్చి అమ్మవారికి సమర్పిస్తారు. 17న సోమవారం ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, హోమాలు, అభిషేకాలు, రాత్రికి గావు పట్టే కార్యక్రమంతో పాటు రంగురంగుల విద్యుత్ దీపాల అలంకరణలతో మొక్కుబడులు ఉన్న వారు చాందినీబండ్లు కట్టి మొక్కులు తీర్చుకుంటారు. ఈ జాతరకు పెద్ద సంఖ్యలో భక్తులు హాజరుకానున్నారు.

నాగారపమ్మ తల్లి చరిత్ర

రైల్వేకోడూరు నియోజకవర్గం చిట్వేలి సమీపంలోని నాగారం నుంచి కొందరు దొంగలు నాగారపమ్మ శిల్పాన్ని అపహరించి తీసుకెళ్తుండగా పింఛా నది ఒడ్డుకు రాగానే చీకటి పడటంతో రాత్రి అక్కడే ఆగారు. ఉదయం నది దాటుతుండగా నాగారపమ్మ విగ్రహం నదిలో పడిపోవడంతో ఎంత వెతికినా ఫలితం లేకపోవడంతో దొంగలు అక్కడి నుండి వెళ్లిపోయారని.. పెద్దినేనికాలువ పంచాయతీలోని బండకాడ ఈడిగపల్లెకు చెందిన కొందరు రజకులు బట్టలు ఉతికేందుకు నదిలోకి వెళ్లినప్పుడు వారికి నాగారపమ్మ విగ్రహం దొరికిందని స్థానికులు చెప్పుకుంటున్నారు. వారు దానిని తీసుకువచ్చి బండకాడ ఈడిగపల్లెకు దక్షిణ భాగాన ప్రతిష్టించి చిన్న గుడిగా నిర్మించుకున్నారు. అప్పటి నుంచి ప్రతి గురు, ఆదివారాల్లో అక్కడ ప్రత్యేక పూజలు జరుగుతుండటం ఆనవాయితీగా మారిపోయింది. ప్రతియేటా ఏరువాక పౌర్ణమికి నాగారపమ్మ తిరుణాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు.

తిరునాళ్లకు భారీ ఎత్తున ఏర్పాట్లు

నాగారపమ్మ తల్లి తిరుణాళ్ల మహోత్సవాలకు భారీ ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. తిరుణాళ్లలో భాగంగా మండల కేంద్రంలోని పురవీధుల్లో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు, కుంకుమార్చనలతో ఊరేగింపు నిర్వహిస్తున్నారు. ఈ జాతరకు అన్నమయ్య, కడప, చిత్తూరు, తిరుపతి జిల్లాలతో పాటు ఇతర జిల్లాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో భక్తులు హాజరు కావడం విశేషం. భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు.

చాందినీ బండ్లు కట్టే భక్తులు తప్పనిసరిగా పోలీసుల అనుమతులు తీసుకోవాలని ఎస్ఐ ఎస్‌కేయం హుస్సేన్ తెలిపారు. ప్రతి ఏడాదిలాగే ఈ ఏడాది పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తామని, ప్రశాంత వాతావరణంలో తిరుణాల నిర్వహించుకోవాలని సూచించారు. అలాగే చాందినీబండ్లు కట్టేవారు విద్యుత్ సబ్‌స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని విద్యుత్‌శాఖ ఏఈ రమేశ్ తెలిపారు. సమాచారం ఇస్తే ప్రమాదాలు జరగకుండా లైన్‌మ్యాన్ అందుబాటులో ఉంటారన్నారు. ఎక్కువ ఎత్తు లేకుండా చాందినీబండ్లు కట్టుకోవాలని సూచించారు.



WANTED TEACHERS
To teach Biology, English. Q. : B.A.,B.Ed.& B.Sc., B.Ed., Preference for Kadapa Local Candidates. Attractive Salary, Cont. : 78422 52415
AJC-188764

10th,ఇంటర్,డిగ్రీ పాసయ్యే ఛాన్స్
చదువు మధ్యలో ఆపేసిన (లేదా) ఫెయిల్ అయిన వారికి 10th, ఇంటర్, డిగ్రీ పాసయ్యే ఛాన్స్ కలదు. కడప సెల్: 90105 01122.
Ajc-188592

కావలెను
ప్రముఖ స్కూల్ హాస్టల్‌లో పనిచేయుటకు టీచర్లు, వార్డెన్లు, ఆయాలు కావలెను. సంప్ర : 9309 21596
Ajc-188593

కావలెను
★ మీ ఇంటి వద్దనే ఉంటూ ఓల్డ్ రికార్డు చూసి, న్యూ రికార్డులు వ్రాయుటకు స్త్రీ, పురుష అభ్యర్థులు 12 మంది కావలెను. నెలకు జీతం : 12000. సంప్ర॥ 7842241787
AJV_192850

CHANGE OF NAME
I, ENDULURU CHANGAMMA (Old name),R/o. Mudrampalli, PondalurPost, Penagalur Mandal, Annamayya District, A.P., hearby changed my name as ENDLURU CHENGAMMA, W/o ENDLURU RANGAREDDY (NEW name)
AJC-188893

CHANGE OF NAME
I, PATAN KAREEMULLA KHAN (OLD NAME) S/o. PATAN JABBAR KHAN, Residing at Door No. 3/94, Sattar Colony, Chemmumiyapeta, Kadapa, YSR Dist., A.P. 516003, India, do hereby Change My Name to PATAN KARIMULLA KHAN (NEW NAME). Hence forth then now I may be called as PATAN KARIMULLA KHAN (NEW NAME)
AJC-188597

PROPERTY FOR RENT
★ ప్రొద్దుటూరు రాజీవ్ సర్కిల్ సున్నమ్ బట్టి వీధిలో రూము బాడుగకు ఇవ్వబడును. 9940693126
AJH-0278

CHANGE OF NAME
★ I, SHAIK KURSHIDA BEGUM (Old Name) R/o: 7/451-2, MOCHAMPET, Kadapa District, A.P. I changed my name as SHAIK KHURSHIDHA BEGUM W/O SHAIK ANWAR (New Name) AJH-002459

ఆంధ్రజ్యోతిలో ప్రకటనల కోసం సంప్రదించండి

WANTED TEACHERS
Wanted Teachers for Higher Classes : 1) Physics, 2) English and Lady Principal. Primary Classes : All Subjects. Contact : 91828 56272, 63039 89168
AJC-188585

సైనిక్ నవోదయ అడ్మిషన్లు
2024 నవోదయ-19, సైనిక్-16, శ్రీ దిన్నెపాటి బసిరెడ్డి వికాస్ సాధించిన సంస్థ. అడ్మిషన్లకు సంప్రదించండి, భగత్‌సింగ్‌నగర్, ఉటుకూరు, కడప. సెల్: 93909 21596
AJC-188587

కావలెను
పీలేరు నందు పనిచేయుటకు కష్టపడే తత్వం కల్గి 7వ తరగతి ఆపైన చదివిన 20-35 సం.లోపు పురుషులు అసిస్టెంటుగా కావలెను. జీతం : 12-15 వేలు, సంప్ర : 98661 91362
Ajc-188765

ఉద్యోగాలు
★YMC నూతంగా ప్రారంభిస్తున్న బ్రాంచ్‌లలో జాబ్ చేయుటకు యువతీ, యువకులకు అవకాశం కలదు. Quali : 10th, Inter, Degree (P/F), Age : 18 to 30. నో ఫీజు. సంప్ర॥ 9177342337
AJW-5967

WANTED
కడప నగరంలో ప్రముఖ రెసిడెన్షియల్ హైస్కూల్ నందు పనిచేయుటకు క్రింద తెలిపిన అభ్యర్థులు కావలెను. లేడీవార్డన్స్ జీతం:12000, లేడి PET's జీతం :15000, సెక్యూరిటీ గార్డ్స్-జీతం : 10వేల నుండి 12వేలు హౌస్ కీపింగ్ వర్కర్స్- జీతం 8000, సెల్: 9059004664, 9849794289
Ajc-156456

వంట మాస్టర్స్ కావలెను
కడప బకెట్ బిర్యాని హోటల్‌లో సౌత్ ఇండియన్ టిఫిన్ సెక్షన్ నందు వంట మాస్టర్ & ఏంజిల్స్ లేడీస్ హాస్టల్ నందు లేడి వంట మాస్టర్ కావలెను. జీతం+ఫుడ్ సౌకర్యం కలదు. సెల్: 98667 68892
Ajc-188767

CHANGE OF NAME
I, PATAN MUNNI (OLD NAME) W/o. PATAN KARIMULLA KHAN, Residing at Door No. 3/94, Sattar Colony, Chemmumiyapeta, Kadapa, YSR Dist., A.P. 516003, India, do hereby Change My Name to PATAN KARIMUNNISA (NEW NAME). Hence forth then now I may be called as PATAN KARIMUNNISA (NEW NAME).
AJC-188597

బంగారం కొనబడును
మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డు పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ. సంప్ర॥ 7382114647
AJA- 189260

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

కొండపేట-బలసింగాయపల్లె రోడ్డు బాగుపడేదెన్నడు

● అడుగడుగునా గుంతలే ● వైసీపీ పాలనలో పట్టించుకోని వైనం ● ఐదేళ్లుగా మరమ్మతులకు నోచుకోని రోడ్డు



కొండపేట వద్ద గుంతలమయంగా రోడ్డు...మరమ్మతులకు నోచుకోని కనుపర్తి - బలసింగాయపల్లె రోడ్డు

చెన్నూరు, జూన్ 13 : రోడ్లు బాగుంటే ఊర్లు బాగుంటాయి.. ఊరి ప్రజలు బాగుంటారు.. గ్రామాల అభివృద్ధి అంతా మౌలిక వసతులపైనే ఆధారపడి ఉంటుంది. కాగా వైసీపీ పాలనలో గ్రామాభివృద్ధి నిర్వీర్యమైంది. చిన్నపాటి మర్మతులకు సైతం నిధులు అందక రోడ్లను అధోగతిపాలు చేశారు. నిత్యం ఎంతో మంది తిరిగే ఈ రోడ్లు ప్రయాణానికి ఇబ్బందికరంగా మారాయి. మరమ్మతులు కూడా చేయకపోవడంతో గ్రామాల ప్రజలు అవస్థలు అన్నీ ఇన్నీ కావు.

అలాంటి కోవలోకే మండలంలోని కొండపేట, కనుపర్తి, బలసింగాయపల్లె గ్రామాల రోడ్లు ఉన్నాయని చెప్పొచ్చు.చాలా ఏళ్లక్రితం టీడీపీ పాలనలో ఈ రోడ్లు అంతో ఇంతో బాగుపడ్డాయి. ఆ తరువాత అప్పటి పాలకులు ఆ ఊసే ఎత్త లేదు. దీంతో రో డ్డంతా గుంతలు కనిపిస్తున్నాయి. చిన్న, పెద్ద గుంతలన్నీ ప్రజల రాకపోకలకు అడ్డంకిగా మా రాయి. చీకటి పడ్డా, వర్షం కురిసినా ఈ దార్లు సక్రమంగా కనిపించవు. వాహనాల్లో నడిచే వారు ప్రమాదాలపాలు కావలసిందే. చివరికి పాదచారులు కూడా వర్షం కురిసే సమయంలో ఏది గుంతనో ఏది మిట్టనో అర్థం కాని పరిస్థితుల్లో రాకపోకలు సాగిస్తున్నారు. ఈ సమస్య ఎప్పుడు దీరుతుందో అని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.కాగా కొత్తగా కొలువుదీరే ప్రభుత్వంలో అయినా మా సమస్యలు తీరుతాయని అందరూ ఆశతో ఎదురుచూస్తున్నారు.

వైద్య ఖర్చులకు సింగారెడ్డి ఆర్థికసాయం



నారాయణమ్మ దంపతులకు ఆర్థికసాయం అందిస్తున్న సింగారెడ్డి శ్రీరామచంద్రారెడ్డి

కడప (ఎడ్యుకేషన్), జూన్ 13 :కడప నగరం ఎర్రముక్కపల్లెకు చెందిన ప్రొద్దుటూరు నారాయణమ్మ, హరిప్రసాద్ దంపతులకు బీజేపీ కేంద్ర ప్రభుత్వ పథకాల రాష్ట్ర కన్వీనరు సింగారెడ్డి రామచంద్రారెడ్డి ఆర్థిక సాయం అందించారు. నారాయణమ్మ పెద్దకుమారుడు వెంకట సాయికి చిన్నప్పటి నుంచి మా టలు సరిగా రావు. అయితే మాటలు వచ్చేందుకు స్పీచ్‌థెరపి చేయించడానికి ఆర్థిక సాయం కోసం సింగారెడ్డి గురువారం రామచంద్రారెడ్డిని సంప్రదించగా ఆయన రాజ్ పద్మఇన్‌కార్ప్ కార్యాలయంలో ఆమెకు రూ.30వేలు ఆర్థికసాయాన్ని అందించారు. చల్లా హరి నాథరెడ్డి, హరి, కాశి, సుజాతమ్మ, రమణ పాల్గొన్నారు.

టీడీపీ ప్రభుత్వం ఏర్పాటుతో జనసేన ఆధ్వర్యంలో సంబరాలు



కేక్‌ను కట్ చేస్తున్న తుంగా రమణయ్య తదితరులు

కడప (ఎడ్యుకేషన్), జూన్ 13 : టీడీపీ ప్రభుత్వం ఏర్పాటు కావడం, ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రిగా పవన్‌కళ్యాణ్ అమరావతిలో ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సంతోషం వ్యక్తం చేశారు. కడప నగరం 26వ డివిజన్ మాసాపేటలో జనసేన జిల్లా నాయకుడు, 26వ డివిజన్ ఇన్‌చార్జ్ గజ్జల సాయి ఆధ్వర్యంలో తుంగా రమణయ్య, పంద్ర రంజిత్, టీడీపీ 26వ డివిజన్ ఇన్‌చార్జ్ చవలముడి శంకర్, టీఎన్ఎస్ఎఫ్‌రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాసాపేట శివ సంబరాలు జరుపుకున్నారు. కేక్ కటింగ్ చేసి పంచిపెట్టారు. కార్యక్రమంలో జనసేన నాయకులు సిద్దు, గౌస్, లోకేశ్, బాబు, అర్జున్, తుంగా మధు, శ్రీను, రంగా, మహేశ్ మాలిక్, తరుణ్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం



సురభి గ్రామం సచివాలయం, వైద్యశాలను పరిశీలించిన టీడీపీ మండల అధ్యక్షుడు మహేశ్వర్‌రెడ్డి

చక్రాయపేట, జూన్ 13 : ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పెట్టుకోవాలని టీడీపీ మండల ఇన్‌చార్జ్ తాళ్లపల్లి మహేశ్వర్‌రెడ్డి తెలిపారు. చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం తొలిసారిగా చక్రాయపేట మండలంలోని టీడీపీ కార్యకర్తల సమావేశంలో మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి కర్యాకర్తకు తోడుగా ఉండి, వారి సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ప్రతి ఒక్కరూ మండలఅభివృద్ధికి కృషి చేయాలన్నారు. గురువారం మండలంలోని సచివాలయాలు, వైద్యశాలలను పరిశీలించి వాటిలోని సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సర్పంచ్ దాసరి ఆంజనేయులు, మెడికల్ స్టోరు జనసేన నాయకుడు తుపాకుల చంద్ర, శంకరరెడ్డి, గణేశ్‌రెడ్డి, ఎల్లయ్య, టీడీపీ యువ నాయకుడు అమర్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగంలో సీఎం తనదైన ముద్ర వేయాలి: ఒంటేరు

కడప (ఎడ్యుకేషన్), జూన్ 13 : అధికారం చేపట్టిన వెంటనే మెగా డీఎస్సీపై తొలిసంతకం చేసిన సీఎం చంద్రబాబునాయుడు మరిన్ని సంస్కరణలతో విద్యారంగంలో తనదైన ముద్ర వేయాలని ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలో 30వేల ఉపాధ్యాయ ఖాళీలున్నట్లు గతంలో పార్లమెంటులో కూడా చెప్పారని, అయితే ప్రస్తుతం 16వేల ఖాళీలు మాత్రమే డీఎస్సీలో ఉన్నాయని క్షేత్రస్థాయిలో పూర్తి నివేదిక తీసుకుని అన్ని ఖాళీలు భర్తీ చేస్తే నిరుద్యోగులకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన 117 జీఓ కారణంగా విద్యావ్యవస్థ గాడి తప్పిందన్నారు.ఉపాధ్యాయులకు ఉపయుక్తకరమైన విదానాలుతెచ్చి ఉపాధ్యాయులల్లో తనకున్న నమ్మకం నిలబెట్టుకోవాలన్నారు.

విద్యాహక్కు చట్టాన్ని అమలు చేయాలి: బీజేపీ



ఎంఈఓ స్టాలిన్‌కు వినతిపత్రం అందిస్తున్న బీజేపీ నాయకులు హరిప్రసాద్

వేంపల్లె, జూన్ 13 : విద్యాహక్కు చట్టం అమలు చేయాలని బీజేపీజిల్లా కార్యదర్శి గాలి హరిప్రసాద్ అధికారులను కోరారు. ఎంఈవో స్టాలిన్‌కు వినతిపత్రం అందించారు. ప్రైవేటుపాఠశాలల్లో విద్యాహక్కు చట్టం కింద పేదలకు 25 శాతం సీట్లు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. అధిక ఫీజులు వసూలు చేయకుండా ఫీజుల పట్టికను పాఠశాలల వద్ద ప్రదర్శించాలని కోరారు. పాఠశాలల్లోనే పాఠ్యపుస్తకాలు, నోటు బుక్కులు కొనాలనే నిబంధనలపై చర్యలు తీసుకోవాలని ఆయన విన్నవించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షురాలు సుష్మ, చరణ్, పవన్ పాల్గొన్నారు.

రేపు ఆలయ గదులకు బహిరంగ వేలం

పులివెందుల రూరల్ 13: పట్టణంలోని అంకాళమ్మదేవత ఆలయానికి సంబంధించి గదులకు బహిరంగ వేలం పాట 15వ తేదీ శనివారం నిర్వహిస్తామని కార్యనిర్వహణ అధికారి కె.వి.రమణ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 1నుంచి 8వ నెంబర్ వరకు గల గదులకు ఈ వేలం పాటలు జరుగుతాయని, గదులు దక్కించుకున్నవారికి మూడు సంవత్సరాల (1-7-2024 నుండి 30-6-2027) వరకు కాలపరిమితి ఉంటుందన్నారు. ఇందుకు వేలం పాటలో పాల్గొనే ప్రతి పాటదారుడు వెయ్యి రూపాయలు దరావతు చెల్లించి పాల్గొనాల్సి ఉంటుందన్నారు. మునిసిపాలిటీ పన్నులు దేవస్థానం వారే చెల్లిస్తారని విద్యుత్ బిల్లులు తదితరవి బాడుగదారులే చెల్లించాల్సి ఉంటుందన్నారు. గదులు దక్కించుకున్న వారు వేలం పాట ముగిసిన వెంటనే మూడు నెలల బాడుగ ముందుగా చెల్లించాల్సి ఉంటుందన్నారు. కావున ఆసక్తిగలవారు 15వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు పట్టణంలోని మిట్టమల్లేశ్వరస్వామి కల్యాణ మండపంలో జరిగే వేలం పాటలో పాల్గొనాలని ఈఓ రమణ కోరారు.

'వాణిజ్యపన్నుల శాఖలో అక్రమాలపై విచారణ జరిపించాలి'

కడప (మారుతీనగర్), జూన్ 13: ఆంధ్రప్రదేశ్ వాణిజ్య పన్నుల శాఖ జిల్లా కార్యాలయంలో జరిగిన అక్రమాలపై సమగ్ర విచారణ జరిపించాలని ది ఆంధ్రప్రదేశ్ కమర్షియల్ ట్యాక్స్ సర్వీసెస్ అసోసియేషన్ కడప డివిజన్ అధ్యక్షుడు జేవీ రమణయ్య, కార్యదర్శి ఎస్ఎస్ శ్రీనివాసులు గురువారం ఓ ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ప్రధానంగా పునర్‌వ్యవస్థీకరణ పేరుతో శాఖను నిర్వీర్యం చేశారన్నారు. ముఖ్యంగా రాష్ట్ర ప్రధాన కార్యాలయంలో కొందరు ఉన్నతాధికారులు పూర్తి అధికారాలను తమ వద్దే ఉంచుకుని క్షేత్ర స్థాయిలో సర్కిల్ కార్యాలయాలను నిర్వీర్యం చేశారన్నారు. కిందిస్థాయి జూనియర్ అసిస్టెంట్, సీనియర్ అసిస్టెంట్ పోస్టులను రద్దు చేశారాన్నరు. రాజ్యాంగంలోని నిబంధనలకు విరుద్ధంగా బదిలీలు చేశారన్నారు. సంవత్సరంలో పదవీ విరమణ చేయనున్న వారిని కూడా మిగులు సిబ్బంది సాకుతో అక్రమ బదిలీలు చేశారన్నారు. ఉద్యోగులు, అధికారులు, అసోసియేషన్ అభ్యర్థనలను, ఫిర్యాదులను పెడచెవిన పెట్టిన కొందరు ఉన్నతాధికారులపై సమగ్ర విచారణ జరిపించాలన్నారు.

నరసింహులుకు పుత్తా అభినందనలు



దాది రామయ్యకు నగదు అందిస్తున్న టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి

కమలాపురం రూరల్, జూన్ 13 : నగర పంచాయతీలోని బాలాజీ మొబైల్ అధినేత పబ్బతి నరసింహులు చెప్పిన మాట నిలబెట్టుకోవడంతో ఆయన్ను టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి అభినందించారు. కమలాపురం నగర పంచాయతీ పరిధిలో 18 బూత్‌లు ఉన్నాయని, ఏ బూత్‌లో టీడీపీకి ఎక్కువ మె జార్టీ వస్తే వారికి లక్ష రూపాయలు బహుమతిగా ఇస్తానని ఎన్నికల ప్రచారంలో పబ్బతి నరసింహులు హామీ ఇచ్చారు. నగరపంచాయతీలోని 12వ బూత్‌లో టీడీపీకి 357 ఓట్లు ఎక్కువ మెజార్టీ వచ్చింది. దీంతో గురువారం ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట ప్రకారం టీడీపీ కార్యాలయంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డికి చేతికి పబ్బర్తి నరసింహులు లక్ష రూపాయలు నగదు అందించారు. ఆయన 12వ బూత్ ఇన్‌చార్జ్ దాది రామయ్యకు ఆ లక్ష రూపాయలు బహుమతిగా అందజేశారు. ఇచ్చిన మాట నిలబెట్టుకున్న నరసింహు లును పుత్తా అభినందించారు. అనంతరం పుత్తా మాట్లాడుతూ అందరూ కష్టపడి పనిచేయడం వల్లే భారీ మెజార్టీ వచ్చిందని, ఎవరికి ఏ అవసరం వచ్చినా స హకరించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ కార్యక్రమంలో కడప పార్లమెంటు మై నార్టీ అధ్యక్షుడు ఖాదర్‌బాషా, కంకర సుబ్బారెడ్డి, వాసుదేవరెడ్డి, జంపాల నరసింహారెడ్డి, ఎల్లారెడ్డి, విభరాపురం సుబ్బరాయుడు, గోపాల్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్తకు నివాళి

వల్లూరు, జూన్ 13: మండల పరిధిలోని వెంకటేశాపురం గ్రామానికి చెందిన టీడీపీ కార్యర్త కావాడి వీరాంజనేయులు మృతి చెందిన విషయం తెలిసిందే. ఆ మేరకు గురువారం నియోజకవర్గ ఇన్‌చార్జ్ పుత్తా నరసింహారెడ్డి ఆ గ్రామానికి చేరుకుని ఆయనకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుటుంబానికి అండగా ఉంటానన్నారు. కాగా మృతుడు విజయవాడలో సీఎం చంద్రబాబునాయుడి ప్రమాణ స్వీకారానికి వెళుతుండగా గుండెపోటు రావడంతో మరణించిన విషయం విదితమే.

ఉత్తమమైన పరిశోధనలు చేయాలి

వేంపల్లె, జూన్ 13 :ఉత్తమమైన పరిశోధనలు చేసేలా విద్యార్థులను తీర్చిదిద్దాలని కెనడాకు చెందిన అంటార్కియా యూనివర్సిటీ ప్రొఫెసరు బీవీ రెడ్డి సూచించారు. వేంపల్లె మండలంలోని ఇడుపులపాయల ట్రిపుల్‌ఐటీలో గురువారం విద్యార్థులు, అ ధ్యాపకులకు సదస్సు నిర్వహించారు. సదస్సులో బీవీ రెడ్డి విద్యార్థులకు అధ్యాపకులకు తగు సూచనలు ఇచ్చారు. ప్రస్తుత ప రిస్థితుల్లో గ్రీన్‌హౌస్ వాయువులు ఉద్గారాలను ఉపయోగించి హైగ్రిడ్ పవర్ జనరేషన్ చేసేలా పరిశోధనలు సాగాలన్నారు. కొత్త ప్రయోగాలు చేసేలా విద్యార్థులను తీర్చిదిద్దాలని అధ్యాపకులకు సలహాలు ఇచ్చారు. అనంతరం బీవీరెడ్డిని ట్రిపుల్‌ఐటీ డైరెక్టరు కుమారస్వామి గుప్త, ఏఓ రవికుమార్, సీఓఈ రమేశ్ సత్కరించారు.

బస్సుల బ్రేక్ కండీషన్ పట్ల అశ్రద్ధ తగదు: ఈడీ

కడప (మారుతీనగర్), జూన్ 13: బస్సుల బ్రేక్ కండీషన్ పట్ల అశ్రద్ధ తగదని ఆర్టీసీ కడప జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గిడుగు వెంకటేశ్వరరావు హెచ్చరించారు. గురువారం స్థానిక ఆర్టీసీ కడప రీజనల్ కార్యాలయ సమావేశ మందిరంలో బస్సుల బ్రేక్ సిస్టమ్‌పై ఆర్టీసీ కడప జోన్ షెడ్యూల్-3 ఇన్‌చార్జ్‌లు, బ్రేక్ మెకానిక్‌లకు ఒకరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

ల్యాండ్ టైట్లింగ్ యాక్టు రద్దు ప్రజావిజయం: పుత్తా





మాట్లాడుతున్న రవిశంకర్‌రెడ్డి



మాట్లాడుతున్న దస్తగిరిరెడ్డి



పుత్తా నరసింహారెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న న్యాయవాదులు.. చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న టీఎన్ఎస్ఎఫ్ నిరుద్యోగ జేఏసీ ప్రతినిధులు

కడప(రూరల్) జూన్ 13 :ల్యాండ్ టైట్లింగ్ యాక్టు రద్దు ప్రజావిజయమని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి పేర్కొన్నారు. టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు గురువారం రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టగానే ప్రజల ఆస్తులకు కంఠగింపుగా ఉన్న ల్యాండ్ టైట్లింగ్ యాక్టును రద్దుపరుస్తూ రెండవ సంతకాన్ని చేయడం అభినంద నీయమన్నారు. ఇది న్యాయవాదులు, అన్ని వర్గాల ప్రజల చారిత్రాత్మక విజయమన్నారు. తెలుగుదేశం పార్టీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు, మాజీ పబ్లిక్ ప్రాసిక్యూటర్ గంగిరెడ్డి శివశంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో న్యాయవాదుల బృందం గురువారం కడప నగరం బిల్టప్ సమీపంలోని టీడీపీ కార్యాలయంలో పుత్తా నరసింహారెడ్డిని కలిశారు. అలాగే కమలాపురం నియోజక వర్గ ఎమ్మెల్యేగా పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి భారీ మెజార్టీతో గెలుపొందిన సుభసందర్భంగా పుష్పగుచ్చాలు అందించి శభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నరసింహారెడ్డి మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం ల్యాండ్ టైట్లింగ్ యాక్టును తీసుకొచ్చి ప్రజల ఆస్తులకు రక్షణలేకుండా చేసిందన్నారు. ఈ చ ర్యను న్యాయవాదులు, అన్ని వర్గాల ప్రజలు ముక్తకంఠంతో వ్యతిరేకించి సదరు యాక్టు రద్దు చేయాలంటూ రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమించినా వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. ఈ విషయంపై అప్పటి ప్రతిపక్ష పార్టీ టీడీపీ అన్ని వర్గాల ప్రజల పక్షాన నిలిచి టీడీపీ అధికారంలోకి రాగానే రద్దు చేస్తామని పార్టీ అధినేత చంద్రబాబు హామీ ఇచ్చారన్నారు. అలాగే న్యాయాదు లు ఎదుర్కొంటున్న ఇతర సమస్యల పరిష్కారాని కి కూడా టీడీపీ ప్రభుత్వం పాటుపడుతుందన్నారు.

సీఎం తొలి 5 సంతకాలు చారిత్రాత్మకం

టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు నాలుగవ సారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే తొలి 5 ఫైళ్లపై చేసిన సంతకాలు ఏపీ చరిత్రలోనే చారిత్రాత్మక విజయమని నరసింహారెడ్డి తెలిపారు. డీఎస్సీ పోస్టుల భర్తీకి తొలి సంతకం, ల్యాండ్ టైట్లింగ్ యాక్టుపై రెండవ సంతకం, వృద్ధులకు అందిస్తున్న రూ.3వే పెన్షన్‌ను రూ.4 వేల పెంపు ఫైల్‌పై మూడవ సంతకం, స్కిల్ సైన్సెస్ ఫైల్‌పై నాలుగవ సంతకం, అన్న క్యాంటిన్ల పునరుద్ధరణ ఫైల్‌పై 5వ సంతకం చేసి అన్ని వర్గాల ప్రజల హృదయాలలో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. పుత్తా నరసింహారెడ్డిని కలిసిన వారిలో న్యాయవాదులు బి.ఓబులేసు, రమేష్, సురేష్ తదితరులు ఉన్నారు.

చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం

కడప (ఎడ్యుకేషన్), జూన్ 13 :మెగా డీఎస్సీపై చంద్రబాబునాయుడి తొలిసంతకం చేసి మాట నిలబెట్టుకున్నాడు. దీనిపై టీఎన్ఎస్ఎఫ్, నిరుద్యోగ జేఏసీ హర్షం వ్యక్తం చేసినట్లు టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు బొజ్జ తిరుమలేశ్ తెలిపారు. గురువారం కడప నగరం సంధ్యా సర్కిల్‌లో చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఏపీ నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు డీఎం ఓబులేసు యాదవ్, తెలుగుయువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాటి అమర్‌నాథరెడ్డి మాట్లాడుతూ సీఎం చంద్రబాబునాయుడు 2024 ఎన్నికల హామీల్లో భాగంగా మొదటి సంతకం డీఎస్సీ ఉద్యోగులపై చేయడం హర్షణీమన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి గోవర్ధనరెడ్డి, నాయకులు జషన్య, డేవిడ్, పోలిరెడ్డి, అప్జల్, లోకేశ్, ఫరీద్, మహేశ్, నవీద్, అఖిల్ పాల్గొన్నారు.

మెగా డీఎస్సీపై తొలిసంతకం హర్షణీయం

మెగా డీఎస్సీపై ముఖ్యమంత్రి తొలిసంతకం చేయడం హర్షణీయమని ఆర్ఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు రవిశంకరరెడ్డి తెలిపారు. గురువారం కడప నగరం ఆర్ఎస్‌యూ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్‌డీఏ కూటమి ఇచ్చిన హామీ మేరకు చంద్రబాబు తొలిసంతకం చేయడం నిరుద్యోగుల్లో ఆశలు నింపిందన్నారు. కార్యక్రమంలో ఆర్ఎస్‌యు జిలాల్ల అధ్యక్షులు రవిశంకర్‌రెడ్డి, కార్యదర్శి చెన్నకేశవరెడ్డి, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

మెగా డీఎస్సీపై హర్షం

కడప (ఎడ్యుకేషన్), జూన్ 13 : సీఎం చంద్రబాబునాయుడు తన తొలి సంతకం మెగా డీఎస్సీపై పెట్టడం హర్షణీయమని టీడీపీ జిల్లా మీడియా కోఆర్డినేటరు చెప్పలి జనార్ధన్ తెలిపారు. అన్న క్యాంటిన్లు తెరవడం ఎంతో మందికి ఆదరణ కలిగించినట్లు అన్నారు.

వృద్ధాప్య పింఛన్ రూ.4వేలు అభినందనీయం



కడప (నాగరాజుపేట), జూన్ 13 : వృద్ధాప్య పింఛన్ రూ.4వేలు అభినందనీయమని టీడీపీ నేత లయన్ పఠాన్ ఖాదర్‌బాషా పేర్కొన్నారు. గురువారం నగరంలోని 39వ డివిజన్ పరిధిలో పింఛను పెంపుపై సీఎం చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

భూహక్కు చట్టం రద్దుపై హర్షం

కడప (సెవెన్‌రోడ్స్), జూన్ 13 : ప్రజల ఆస్తులకు భద్రత లేని ఏపీ భూహక్కుల చట్టం జీఓ నెం.512 ను రద్దు చేస్తూ రెండో సంతకం చేయడం హర్షణీయమని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి దస్తగిరిరెడ్డి అన్నారు. గురువారం రైతు సంఘం జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

APS RTC
టెండరు ప్రకటన
పల్లె వెలుగు
YSR కడప జిల్లా పరిధిలోని వివిధ డిపోలకు సంబంధించిన బస్ స్టేషన్‌లలో స్టాల్స్/ షాపులు, క్యాంటీన్, ఖాళీ స్థలములలో వ్యాపారములు చేసుకొనుటకు సీల్డు టెండర్లు కోరబడుచున్నవి. (1) టెండరు ఫారములు సంబంధిత డిపో మేనేజర్ల వారి కార్యాలయములలో తేది.14-06-2024 నుండి తేది.27-06-2024 వరకు అన్ని ఆఫీసు పనిదినములలో ఉ॥10.30 గం॥ల నుండి సా॥5.00 గం॥ల వరకు అమ్మబడును. (2) పూర్తి చేసిన టెండరు ఫారములు తేది.28-06-2024న ఉ॥10.30 గం॥ల నుండి మ॥2.00 గం॥ల లోపున జిల్లా ప్రజా రవాణా అధికారి వారి కార్యాలయం, కడప నందు ఏర్పాటు చేసిన టెండరు బాక్సు నందు వేయవలెను. అదే రోజు మ.3.00 గం॥లకు టెండరుదారుల సమక్షములో టెండర్లు తెరువబడును. (3) పూర్తి వివరములకు మా వెబ్‌సైట్ https://apsrtc.ap.gov.in లో tenders ను చూడగలరు. (4) ఎట్టి కారణము చూపకుండా టెండర్లు అంగీకరించుటకు లేదా తిరస్కరించుటకు మరియు రద్దుచేయుటకు APSRTC కి పూర్తి అధికారము కలదు.
నెం. E2/797(03)/2024-DPTO/YSR, తేది:12-06-2024 సం/- జిల్లా ప్రజా రవాణా అధికారి, కడప.

విద్యాకానుక కిట్లు పంపిణీ

కమలాపురం రూరల్, జూన్ 13 : విద్యాకానుక కిట్లను పాఠశాలలకు పంపిణీ చేస్తున్నామని ఎంఈఓ సుభాషిణి తెలిపారు. గురువారం స్థానిక ఎంపీపీ మెయిన్ స్కూలులో వివిధ పాఠశాలల హెచ్ఎంలు, హెచ్‌సీలకు ఆమె విద్యాకానుక కిట్లను పంపిణీ చేశారు. 4200 మందికి పాఠ్యపుస్తకాలు వచ్చాయని, ఇంకా 15 వేలు బుక్స్ రావాల్సి ఉందన్నారు.

ఆర్బీకేలలో పేర్లు నమోదు చేసుకోండి

సింహాద్రిపురం, జూన్ 13: ఖరీఫ్ సాగుకు సంబంధించి ప్రభుత్వం ఇస్తున్న రాయితీ విత్తనాల కోసం సంబంధిత రైతు భరోసా కేంద్రాలలో నగదు చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని వ్యవసాయాధికారి శివమోహన్‌రెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. వేరుశనగకాయలు, ఉద్దులు, పెసలు, కందులు, కొర్రలు, రాగులు సబ్సిడీపై అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏఓ కోరారు.



పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత



మొక్కలు నాటుతున్న జిల్లా విద్యాశాఖాధికారి అనూరాధ తదితరులు

సీకేదిన్నె, జూన్ 13: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బా ధ్యత అని జిల్లా విద్యాశాఖాధికారిణి అనూరాధ తెలిపారు. పర్యావరణ పరిరక్షణ వారోత్సవాల్లో భాగంగా మండల కేంద్రమైన చింతకొమ్మదిన్నె జిల్లా పరిషత్ హై స్కూలులో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మేరీలైఫ్ వారోత్సవాలు వారం రోజులపాటు నిర్వహిస్తామన్నారు. అందులో భాగంగా వ్యర్థాల నిర్వహణ గురించి విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు పర్యావరణంపై అవగాహన పెంచుకుని వారి పుట్టినరోజు, పండుగల రోజు చెట్లను నాటి పర్యావరణ పరిరక్షణకు తమవంతు కృషి చేయాలన్నారు. విద్యార్థి దశ నుంచే పర్యావరణం పట్ల అవగాహన పెంచుకుని సమాజ సేవకు ముందుండాలన్నారు. విద్యార్థులకు వ్యర్థాల నిర్వహణ, ఇంధన పొదుపు, పోషణ గురించి తెలియజేయాల్సిన ఆవశ్యకత ఉపాధ్యాయులదేనన్నారు. ప్రతి పాఠశాలలో పచ్చదనం పెంచి పర్యావరణ పరిరక్షణకు ముందుండాలన్నారు. అనంతరం విద్యార్థులకు అందించే స్టూడెంట్ కిట్లను పరిశీలించారు. మండల విద్యాశాఖాధికారి వెంకటరామిరెడ్డి, రమాదేవి, సమగ్ర శిక్షా అధికారులు దశరథరామిరెడ్డి, మిట్టా కేశవరెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శోభారాణి, ఉపాధ్యాయులు గంగాధర్, ప్రతాప్, గురువయ్య, శివ, హరి, పీడీ రుద్రమూర్తి యాదవ్ పాల్గొన్నారు.

బకాయిలు చెల్లించకుంటే కోర్టుకు వెళతాం

వేంపల్లె, జూన్ 13 : ప్రభుత్వ ఉద్యోగులకు ఉపాధ్యాయులకు రిటైర్డ్ అయిన ఉద్యోగులు ఉపాధ్యాయులకు రావలసిన ఏపీజీఎల్ఐసీ బకాయిలను చెల్లించకపోతే రాబోవు రోజుల్లో కోర్టుకు వెళతామని ఎస్టీయు జిల్లా మాజీ అధ్యక్షుడు సింగారెడ్డి నరసింహారెడ్డి ఒక ప్రకనటలో హెచ్చరించారు. 8 నెలలు గడుస్తున్నా రిటైర్డ్ ఉపాధ్యాకులకు సంబంధించిన ఏపీ జీఎల్ఐసీ బకాయిలు ఇప్పటి వరకు ఇవ్వలేదన్నా రు. సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులకు రావాలసిన మొత్తాన్ని డ్రా చేసుకునేందుకు దరఖాస్తు పోర్టల్ పనిచేయడంలేదని ఇది వైసీపీ ప్రభుత్వం ఉద్యోగుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహ రించడంమేనన్నారు. బకాయిలను వెంటనే చెల్లించాలని ఆయన విన్నవించారు.

విద్యుత్ సమస్యలను వెంటనే పరిష్కరించాలి

కడప (నాగరాజుపేట), జూన్ 13 : విద్యుత్ సమస్యలపై వెంటనే స్పందించాలని విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజనీరు రమణ సూచించారు. విద్యుత్ సమస్యలపై సిబ్బంది సకాలంలో స్పందించి సంస్థపై ప్రజల సంతృప్తికరస్థాయిని పెంచే విధంగా పనిచేయాలన్నారు. గురువారం కడప డివిజన్ విద్యుత్ కార్యాలయంలో కడప డివిజన్ పరిధిలోని కడప, చింతకొమ్మదిన్నె, పెండ్లిమర్రి, వల్లూరు, చెన్నూరు మండలాల క్షేత్రస్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేటాయించిన ప్రాంతాల్లో నివాసాలు ఉంటూ వినియోగదారులకు చేరువలో ఉంటూ వారి సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. తెగిపడిన విద్యుత్ వైర్లను తాకకుండా, విద్యుత్‌ను కొక్కీల ద్వారా కాకుం డా నాణ్యమైన సర్వీసు వైరు ద్వారా స్తంభం నుండి మీటరు వద్దకు తీసుకునే విధంగా భద్రతా నియమాలు విధిగా పాటించే విధంగా, విద్యుత్‌కు సంబంధించి ఎటువంటి మరమ్మత్తు అయినా విద్యుత్‌శాఖ సిబ్బందితో చేయించుకునే విధంగా ప్రజల్లో అవగాహన తేవాలన్నారు.

క్యాన్సర్‌ను ప్రాథమిక దశలోనే నివారించవచ్చు

అవగాహన సదస్సులో సూపరింటెండెంట్ ఆనంద్‌బాబు



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సూపరింటెండెంట్ డాక్టర్ ఆనంద్ బాబు

ప్రొద్దుటూరు, జూన్ 13: దేశంలో రోజు రోజుకూ క్యాన్సర్ వ్యాధి పెరిగి పోతోందని దీనిని ప్రాథమిక దశలో గుర్తిస్తే ప్రాణాపాయం నుంచి కాపాడవచ్చని జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఆనంద్ బాబు తెలిపారు. గురువారం స్థానిక జిల్లా ఆస్పత్రిలో వైద్యాధికారులు కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ ఏఎన్‌ఎంలకు క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్టుపై శిక్షణ నిర్వహించారు. ఈ సదస్సులో ఆయన మాట్లాడుతూ క్యాన్సర్ స్క్రీనింగ్ గురిచి శిక్షణ తీసుకున్న తరువాత క్షేత్ర స్థాయిలో క్యాన్సర్ గురించి ప్రాథమిక దశలోనే గుర్తించేలా స్క్రీనింగ్ చేస్తారన్నారు. క్యాన్సర్‌ను గుర్తిస్తే వారు వారి జీవన విధానంలో తీసుకోవలసిన జాగ్రత్తలు ఆహారం అలవాట్లపై ప్రత్యేకంగా అవగాహన కల్పిస్తారన్నారు. క్యాన్సర్ కారకాలను గుర్తించి వారికి చికిత్స ఎక్కడ దొరుకుంతో చికిత్స విధానంపై అవగాహన పెంపొందిస్తారన్నారు. కార్యక్రమంలో డాక్టర్ హిమాదేవి, రిసోర్స్ పర్సన్ డాక్టర్ మీనా కుమారి, డాక్టర్ మంజుల, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

సీఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్‌కు అధికార లాంఛనాలతో అంత్యక్రియలు


ఓబులేసుడు మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న సీఆర్‌పీఎఫ్ బృందం ఇన్‌సెట్‌లో ఓబులేసుడు (ఫైల్ ఫొటో)

పోరుమామిళ్ల, జూన్ 13: రెండురోజుల కిందట ప్రకాశం జిల్లా త్రిపురాంతకం సమీప ఫ్లైఓవర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సీఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్ ఓబులేసుడుకు అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. పోరుమామిళ్ల మండలం నర్సింగపల్లె వాసి ఓబులేసుడు ఒరిస్సాలో సీఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తూ రెండురోజుల కిందట కారులో పోరుమామిళ్లకు వస్తుండగా లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందిన విషయం పాఠకులకు విదితమే. గురువారం పోరుమామిళ్ల మండలం నరసింగపల్లెలో అతని అంత్యక్రియలు జరిగాయి. ఈ అంత్యక్రియలకు ఒరిస్సా నుంచి వచ్చిన సీఆర్‌పీఎఫ్ బృందం కానిస్టేబుల్ మృతదేహంపై జాతీయ జెండాను కప్పి పుష్పగుచ్చాలతో నివాళులర్పించారు. అనంతరం అంత్యక్రియల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండల నలుమూలల నుంచి అతని స్నేహితులు, బంధువులు అధిక సంఖ్యలో పాల్గొని అశ్రునయనాలతో అంత్యక్రియలు నిర్వహించారు.

బ్యాక్ వాటర్ ద్వారా సాగునీరు అందించాలి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఇమ్మానుయేల్

బద్వేలు రూరల్, జూన్ 13: సోమశిల వెనుక జలాలను గోపవరం, బద్వేలు, అట్లూరు మండలాలకు సాగునీరు అందించాలని సీపీఐ రూరల్ కార్యదర్శి నాగదాసరి ఇమ్మానుయేల్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గురువారం స్థానిక జేవీభవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వం ఒకటిన్నర టీఎంసీ నీటిని ఇచ్చేందుకు 197 శాశ్వత జీఓ విడుదల చేసినా నిధులు కేటాయించలేదన్నారు. కాగా జగన్ రోడ్‌షోలో సోమశిల వెనుక జలాలను బద్వేలుకు తెప్పిస్తామని ప్రతిపక్ష నేతగా వైఎస్ జగన్ మాట ఇచ్చి అధికారం చేపట్టిన తరువాత పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. ఇప్పటికైనా ప్రస్తుత సీఎం చంద్రబాబు గతంలో ఇచ్చిన జీఓ ప్రకారం నిధులు కేటాయించి మూడుమండలాలకు ఒకటిన్నర టీఎంసీ నీటిని 33 చెరువులకు నింపి ఈ ప్రాంత వ్యవసాయ రైతులను ఆదుకోవాలని ఆయన కోరారు. ఇందుకు బద్వేలు టీడీపీ నేతలు కూడా సహకారం అందించాలన్నారు. కార్యక్రమంలో మహిళా సంఘం ఏరియా కార్యదర్శి విజయమ్మ, డీహెచ్‌పీఎస్ పట్టణ కార్యదర్శి మునిరత్నం, ఓబయ్య, రమణ, కల్యాణ్, స్వామిదాసు, మధు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్‌ఆర్ ఇంజనీరింగ్ కళాశాలకు అదనపు సీట్లు మంజూరు

ప్రొద్దుటూరు టౌన్, జూన్ 13: వైఎస్‌ఆర్ ఇంజనీరింగ్ కళాశాలకు ఏఐటీఈ అదనపు సీట్లు మంజూరు చేసిందని ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి.నాగరాజు తెలిపారు. కళాశాలలో ఉన్న ఆరు బ్రాంచ్‌లకు ప్రతి విభాగానికి 20 సీట్ల వంతున మెటలర్జి విభాగానికి 30 సీట్లు వంతున మొత్తం 130 అదనపు సీట్లకు అనుమతి లభించిందన్నారు. మే 20వ తేదీ ఏఐటీఈ కమిటీ వర్చువల్‌గా కళాశాలను తనిఖీ చేసింది. కళాశాలకు ఉన్న భవనాలు, ఫ్యాకల్టీలు, బోధనేతర సిబ్బంది, ప్రయోగశాలలు, గ్రంథాలయం, ప్లేస్‌మెంట్స్, విద్యార్థుల ఉత్తీర్ణత శాతం, పాఠశాల మైదానంపై సంతృప్తి వ్యక్తం చేసి అదనపు సీట్లు మంజూరు చేశారన్నారు. 2024-25 విద్యాసంవత్సరం నుంచి ఎక్కువ మంది విద్యార్థులు చేరడానికి అవకాశం ఉందన్నారు. అదనపు సీట్లు మంజూరు పట్ల ప్రిన్సిపాల్, డీన్ ప్రొఫెసర్ కేవీ రమణయ్య, అధ్యాపకులు ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు.

అడల్ట్ ‘బీసీజీ’తో టీబీ నుంచి రక్షణ


టీకా వేయడాన్ని పరిశీలిస్తున్న మెడికల్ ఆఫీసర్లు

ప్రొద్దుటూరు, జూన్ 13: అడల్ట్ బీసీజీ టీకా తీసుకోండి టీబీ నుంచి కాపాడుకోండి అంటూ టీబీ టీకా ప్రోగ్రాం స్టేట్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ లక్ష్మీ సౌజన్య పిలుపు నిచ్చారు. గురువారం వైద్య సిబ్బంది పెద్దలకు టీకా వేయించడాన్ని గోపవరం పంచాయితీ ఆచార్లకాలనీలో ఏర్పాటు చేశారు. ఆమె మాట్లాడుతూ దేశంలో క్షయ నివారణ కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కంకణం కట్టుకున్నాయన్నారు. ఏవిధంగా క్షయ వస్తుందో అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఇప్పటికే సచివాలయాల్లో నెలరోజులుగా ఈ టీకాను అందుబాటులో వుంచి పెద్దలకు టీకా ఇస్తున్నామన్నారు. ఆగస్టు లోపుగా ఈ కార్యక్రమం లక్ష్యాన్ని పూర్తి చేయాలన్నారు. కార్యక్రమాన్ని ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా అడిషనల్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ రవి బాబు, డాక్టర్ శివప్రసాద్ డాక్టర్ శ్రీనివాస్ సూపర్‌వైజర్ రాజారత్నం, కృష్ణమ్మ, వరప్రసాద్, చంద్రకళ, మున్నా గంగా సుమలత తదితరులు పాల్గొన్నారు.

బీసీజీ టీకాతో వ్యాధి నివారణ

ప్రొద్దుటూరు క్రైం, జూన్ 13: కేసీ పుల్లయ్య అపార్ట్‌మెంట్‌లో వయోజన బీసీజీ టీకా వేయించారు. వైఎంఆర్ కాలనీలో వ్యాధి నివారణ కోసం వైద్యులు సౌజన్య, రవిబాబు బీసీజీ వ్యాక్సినేషన్‌ను పరిశీలించారు. స్టేట్ టీబీ నోడల్ ఆఫీసర్ సౌజన్య టీకా వేసి పరిశీలించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు శివప్రసాద్‌రెడ్డి, దినేష్‌బాబు, జెబీఎంఓ శివశంకరయ్య, టీబీ సూపర్‌వైజర్ జీవరత్నం, సిద్దారెడ్డి, ప్రసాద్, మున్నా, సీఓ సుబ్బారెడ్డి, ఏఎన్‌ఎం జ్యోతి, ఆశాలు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన టీడీపీ, ఉద్యోగ సంఘాల నేతలు


మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని కలిసిన టీడీపీ నేతలు, ఉద్యోగ సంఘాల నేతలు

అట్లూరు, జూన్ 13: ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారోత్సవానికి వెళ్లి అక్కడ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డిని పార్టీ, ఉద్యోగ సంఘ నేతలు కలిశారు. అట్లూరు మండల టీడీపీ అధ్యక్షుడు పి.మల్లికార్జునరెడ్డి పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు బి.గోపాల్‌రెడ్డి, బద్వేలు ఎన్‌జీఓ మాజీ అధ్యక్షుడు పొన్నవోలు సాంబశివారెడ్డి, క్లస్టర్ యూనిట్ నేతలు రాధాక్రిష్ణారెడ్డి, అల్లం వెంకటసుబ్బయ్య సీఎం చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారానికి వెళ్లారు. ఇందులో మంత్రిగా ప్రమాణం చేసిన ఆనం రామనారాయణరెడ్డిని ఆయన అతిథిగృహంలో రాత్రి మర్యాదపూర్వకంగా కలిసి శాలువా, పుష్పగుచ్ఛం అం దించి శుభాకాంక్షలు తెలిపి సంతోషం వ్యక్తం చేశారు. మంత్రి మాట్లాడుతూ బద్వేలు నియోజకవర్గ వాసులంటే ఆయనకు ఎనలేని అభిమానమన్నారు. దివంగత మంత్రి వీరారెడ్డి కుటుంబం పట్ల ఆయనకున్న అనుభవాన్ని వారితో పంచుకున్నారు. టీడీపీని నమ్ముకున్న నేతలకు ఉద్యోగ సంఘ నేతలకు ఉద్యోగులకు టీడీపీ ప్రభుత్వం అన్ని విధాలుగా న్యాయం చేకూరుస్తుందని ఆయన తెలిపారు.

మంత్రి సత్యకుమార్‌ను కలిసిన రోశన్న


మంత్రి సత్యకుమార్‌ను కలిసిన బొజ్జా రోశన్న

పోరుమామిళ్ల, జూన్ 13: మంత్రి సత్యకుమార్‌ను బీజేపీ బద్వేలు నియోజకవర్గ నాయకుడు రోశన్న మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. గురువారం ఆయన జిల్లా అధ్యక్షుడు శశిభూషణరెడ్డి బీజేపీ నేత పండరి తదితరులు ఆయనను కలిసి సన్మానించారు.

రికార్డులను పరిశీలించిన వైద్యాధికారులు


రికార్డులను పరిశీలిస్తున్న వైద్యాధికారులు

ఖాజీపేట, జూన్ 13: రావులపల్లె హెల్త్ వెల్ఫేర్ వెల్నెస్ సెంటర్‌ను వైద్యాధికారులు ఆయేషా సుల్తానా, డాక్టర్ సంతోష్‌బాబు, డాక్టర్ వాళ్ల వేర్మతి రికార్డులను పరిశీలించారు. ఆరోగ్య కేంద్రం నేషనల్ క్వాలిటీ అసెస్‌మెంట్ నిర్వహించారు. వారు మాట్లాడుతూ దోమల ద్వారా వ్యాపించే వ్యాధులపై గ్రామస్థులకు అవగాహన కల్పించాలని, గ్రామంలో మాతృ, శిశు మరణాలు లేకుండా చూడాలన్నారు. హెల్త్‌క్లినిక్‌లో రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి నాగభూషణం, నోడల్ ఆఫీసర్ అరుణకుమారి, సిబ్బంది క్రిష్ణప్రియ, శోభన్‌బాబు, ఆశాలు, పాల్గొన్నారు.

కూటమి నేతలతో మండల ఇన్‌చార్జ్ భేటి

కొండాపురం, జూన్ 13: మండలంలోని టీడీపీ, బీజేపీ నేతలు, కార్యకర్తలతో గురువారం టీడీపీ కార్యాలయంలో జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి సోదరుడు, కూటమి మండల ఇన్‌చార్జ్ దేవగుడి శివనారాయణరెడ్డి భేటి అయ్యారు. మండల సమస్యల గురించి వివిధ గ్రామాల నుంచి వచ్చిన నేతలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా వలంటీర్లు, డీలర్ల నియామకం గురించి చర్చించారు. మండలంలో తక్షణమే పరిష్కరించాల్సిన సమస్యల గురించి, అభివృద్ధి పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. వీటన్నింటిని ఎమ్మెల్యే, టీడీపీ ఇన్‌చార్జ్ భూపేశ్‌రెడ్డితో చర్చించి వెంటనే తగిన కార్యాచరణ చేపడతామని శివనారాయణరెడ్డి తెలిపారు.

అవన్నీ దొంగబిల్లులు...

- ఇకపై ఒక్కపైసా చెల్లించకండి
- కార్యదర్శికి చిలమకూరు ఎంపీటీసీ ఫిర్యాదు


కార్యదర్శికి వినతిపత్రాన్ని ఇస్తున్న బీజేపీ ఎంపీటీసీ

ఎర్రగుంట్ల, జూన్ 13: మేజర్ గ్రామపంచాయితీ చిలమకూరులో గత సర్పంచితో కూడిన పాలకవర్గం దొంగబిల్లులు పెట్టుకుని కాజేశారని ఇకపై ఒక్కపైసా కూడా వారికి చెల్లించవద్దని చిలమకూరు-2 బీజేపీ ఎంపీటీసీ కే.నవీన్‌కుమార్ కార్యదర్శి క్రిష్ణయ్యకు గురువారం ఫిర్యాదు చేశారు. ఈ సమస్యపై అనేకసార్లు కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. గ్రామంలో నీటి సరఫరా, రోడ్లు, ఇతర ఖర్చులకు విచారణ పూర్తి అయ్యేవరకు నిలుపుదల చేయమని కోరారు. గతంలో జరిగిన అనేక అవినీతి పనులపై కూడా పూర్తి స్థాయిలో విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు నాగేశ్వరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రశీదు తప్పనిసరిగా పొందాలి


ఎరువుల కేంద్రం తనిఖీ చేస్తున్న వ్యవసాయాధికారులు

పోరుమామిళ్ల, జూన్ 13: రైతులు విత్తనాలు కొనుగోలు సమయంలో నగదు రశీదు తప్పనిసరిగా పొందాలని వ్యవసాయ సంచాలకులు నాగరాజు పేర్కొన్నారు. గురువారం పోరుమామిళ్లలోని బీటీ ఆగ్రో టీబీఎస్‌శ్రీనివాస్ మన గ్రోమోర్ విక్రయ కేంద్రాల్లో వ్యవసాయ సంచాలకులు నాగరాజు ఆదేశాల మేరకు వ్యవసాయ అధికారులు వరహరి కుమార్ తదితరులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని విత్తన విక్రయ కేంద్రాలు, బిల్‌బుక్‌లు, లేబిల్లులు, స్టాకు బుక్‌లు, బ్లాక్‌బోర్డు తనిఖీ చేశారు.

వెలగని వీధి లైట్లు

- పట్టించుకోని అధికారులు
- నిధులున్నా మరమ్మతులేవి?
- చీకట్లోనే బ్రహ్మంగారి గ్రామోత్సవం

బ్రహ్మంగారిమఠం, జూన్ 13: బ్రహ్మంగారిమఠం మండల కేంద్రంలోని పాతూరు, స్వామి నివాసగృహం వీధిలో ఆరు నెలలుగా వీధిలైట్లు వెలగడంలేదు. అధికారులకు గ్రామస్థులు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా కూడా లెక్కచేయడంలేదు. కాలజ్ఞాన కర్త పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి నివాసం చేసిన ఇల్లు, మంచినీటిబావి ఉండడంతో భక్తులు అధిక సంఖ్యలో ఇక్కడికి చూసేందుకు వస్తుంటారు. ప్రధాన రహదారి కావడంతో ప్రజలు, అటు యాత్రికులు వస్తుంటారు. ఆరు నెలలుగా ఇక్కడ వీధిలైట్లు లేకపోవడంతో చీకట్లోనే ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ విషయాన్ని పంచాయతీ కార్యదర్శి, మండల పరిషత్ అభివృద్ధి అధికారికి తెలిపినా ఫలితం దక్కలేదని గ్రామ ప్రజలు వాపోతున్నారు. కాగా వీరబ్రహ్మేంద్రస్వామి గ్రామోత్సవం చీకట్లోనే నిర్వహిస్తున్నారు. భక్తులు కొందరు ఈ పంచాయతీకి అధికారులున్నారా లేరా అని ఒకరినొకరు అడుగుతున్నారు.

ఒక వైపు మేజరు పంచాయతీ కావడంతో గతంలో రూ. 40 లక్షలకు పైగా నిధులు పంచాయతీకి రావడం జరిగింది. అయితే అధికారులు మటుకు విద్యుత్ లైట్లు మరమ్మత్తులు ఎదుకు చేపట్టలేదో ప్రజలకు అర్థం కావడంలేదు. ఇప్పటికైనా విద్యుత్‌లైట్లు లేని చోట నూతన లైట్లు ఏర్పాటు చేసి వెలగని లైట్లకు మరమ్మత్తులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.


కట్టమీది రామకృష్ణా రెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

టీడీపీ నేత కట్టమీది రామకృష్ణారెడ్డికి ఎమ్మెల్యే ‘వరద’ నివాళులు

ప్రొద్దుటూరు, జూన్ 13: ఇటీవల అకాల మరణం చెందిన ప్రొద్దుటూరు మండల టీడీపీ నేత కట్టమీది రామకృష్ణా రెడ్డికి ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి నివాళులర్పించారు. రామకృష్ణారెడ్డి సమారాధన సందర్భంగా గురువారం ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి కొత్తపల్లె పంచాయితీలోని ఆయన స్వగృహానికి వెళ్లి రామకృష్ణారెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయనలేని లోటు టీడీపీకి తీర్చలేనిదన్నారు.

మోడల్ స్కూల్‌కు దరఖాస్తు చేసుకోవాలి

ఖాజీపేట, జూన్ 13: ఖాజీపేట మోడల్ స్కూల్‌లో 7, 8, 9 తరగతుల్లో చదివేందుకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ విజయనరసింహ అన్నారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ ఖాళీగా ఉన్న తరగతుల్లో చదివేందుకు ఆసక్తిగల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు 23.6.2024 పరీక్ష జరుగుతుందని, ఉత్తీర్ణులైన వారిని మాత్రమే చేర్చుకుంటామన్నారు.

రేపు గంగమ్మ తిరుణాళ్ల


గంగమ్మదేవత మూలవిరాట్టు

మైదుకూరు, జూన్ 13: శివపురం హరిజనవాడలో వెలసిన గంగమ్మ ఆలయంలో శనివారం నుంచి ఆదివారం వరకు తిరుణాళ్ల మహోత్సవం నిర్వహించనున్నారు. శనివారం అమ్మవారి మూల విరాట్టుకు పంచామృతాభిషేకాలు, సామూహిక కుంకుమార్చనలు చేపట్టి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఆదివారం సేద్యపు ఎద్దులచే బండలాగుడు పోటీలు, ట్రాక్టర్ రివర్స్ పోటీలు నిర్వహించి విజేతలకు నగదు బహుమతులు అందచేయనున్నట్లు సర్పంచ్ కొండ భాస్కర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్, మాజీ మంత్రి డీఎల్ రవీంద్రారెడ్డి పాల్గొంటారని, భక్తులు అందరూ పాల్గొని అమ్మవారి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని ఆయన కోరారు.

నేడు సాయిబాబా ఆలయ వార్షికోత్సవం

ప్రొద్దుటూరు టౌన్, జూన్ 13: లింగాపురంలో ఉన్న షిర్డిసాయిబాబా ఆలయం వార్షికోత్సవాలను శుక్రవారం ఘనంగా నిర్వహించనున్నట్లు సాయిబాబా సేవాశ్రమం కమిటీ నిర్వాహకులు తెలిపారు. శుక్రవారం ఉదయం సుప్రభాత సేవతో ఉత్సవాలు ప్రారంభం అవుతాయని, విశేష అభిషేకాలు, అర్చనలు, సాయిసత్యవ్రతములు, చందనోత్సవం, మధ్యాహ్న హారతి, ఊరేగింపు, సాయంత్రం సత్సంగం, 6 గంటలకు ధూప హారతి వంటి పూజా కార్యక్రమాలు ఉంటాయన్నారు. భక్తులు స్వామివారిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించాలని ఒక ప్రకటనలో కోరారు.

‘కడప జిల్లాగా పేరు మార్చాలి’

ప్రొద్దుటూరు టౌన్, జూన్ 13: కడప జిల్లాకు ఉన్న ప్రాముఖ్యతను దృష్టిలో పెట్టుకుని కడప జిల్లాగా పేరు పెట్టాలని రాయలసీమ పరిరక్షణ సంఘం రాష్ట్ర కన్వీనర్ ఎం.ప్రతాప్‌రెడ్డి డిమాండ్ చేశారు. తిరుమల తొలిగడప కడప అని, అటువంటి విశిష్టత ఉన్న కడప జిల్లా పేరును తొలగించి వైఎస్‌ఆర్ జిల్లాగా పేరు పెట్టారన్నారు. పేరు మార్పుపై జిల్లా ప్రజలు నిరసన వ్యక్తం చేయడమే కాక ఉద్యమాలు కూడా చేశారని గుర్తుచేశారు. ప్రభుత్వం పూర్వం ఉన్న కడపజిల్లా పేరు పెట్టాలని కోరారు. అలాగే యోగివేమన యూనివర్సిటీలో ఉన్న వైఎస్‌ఆర్ విగ్రహాన్ని తొలగించాలని కోరారు.

ఘనంగా సీతారాములవారి ఆలయ వార్షికోత్సవం


బండలాగుడు పోటీలో పాల్గొన్న వృషభాలు

కాశినాయన జూన్ 13: బాలరాజుపల్లెలో గురువారం సీతారాములవారి ఆలయ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక పూజలు, అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో భాగంగా బండలాగుడు పందెం పోటాపోటీగా సాగాయి ఇందులో ప్రథమ బహుమతిని కడప జిల్లాలోని చౌటుపల్లెకు చెందిన మార్తల చంద్రఓబుల్‌రెడ్డి ఎద్దులు గెలిచి రూ100000లు అందుకోగా, ద్వితీయ బహుమతిని నంద్యాల జిల్లాకు చెందిన కుందూరు రామ్‌భూపాల్‌రెడ్డి ఎద్దులు రూ.70000 అందుకున్నాయి.

తెలుగుకు పట్టం కట్టాలి

- అధికార భాష సంఘం అధ్యక్షుడిని నియమించాలి
- తెలుగుభాషా వికాస ఉద్యమ జిల్లా శాఖ విజ్ఞప్తి

గోపవరం, జూన్ 13: తెలుగుభాషకు పట్టం గట్టి ప్రాథమిక పాఠశాలల్లో తెలుగు మాధ్యమం ప్రవేశపెట్టాలని తెలుగుభాషా వికాస ఉద్యమ కడప జిల్లా అధ్యక్షుడు డాక్టర్ గానుగపెంట హనుమంత రావు నూతన సీఎం చంద్రబాబు నాయుడుకు విజ్ఞప్తి చేశాడు. గురువారం మొల్ల స్మారక మందిరంలో మొల్లమాంబ విగ్రహానికి పూలమాల అలంకరించి, చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించిన ఆయన మాట్లాడుతూ ఏడు దశాబ్దాల కిందటే తెలుగుభాషకు సుసంపన్నం చేసిన కవయిత్రి మొల్ల సంఘసంస్కర్త వీరబ్రహ్మం, పథక కవితా పితామహుడు తాళ్లపాక అన్నమయ్య, సుమతీ శతక కర్త బద్దెన, ఆంగ్ల చక్రవర్తి సీపీ బ్రౌన్, తాళ్లపాక తిమ్మక్క తదితరులు తెలుగుభాషను ఆరాధించారన్నారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన చంద్రబాబు సుపరిపాలన అందించాలని కోరారు. తెలుగుభాషకు సమర్థుడైన రాష్ట్రఅధ్యక్షున్ని నియమించి, ప్రపంచ తెలుగు మహాసభలను వైభవంగా నిర్వహించి గత వైభవం తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో మొల్లపీఠం ప్రధాన కార్యదర్శి మనోజ్‌కుమార్, మహాత్మా జ్యోతిరావుఫూలే సాధన కమిటీ చైర్మన్ పిక్రిష్ణమూర్తి, ఆవాజ్ కమిటీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అన్వర్‌బాషా, బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు కుప్పాల నరసింహులు, మొల్లపీఠం కోశాధికారి గుమ్మళ్ల శ్రీనివాసులు, టీడీపీ నేతలు వెంకటేశ్వర్లు, కుంభగిరి రాజగోపాల్ పాల్గొన్నారు.

బడిగంట మోగింది

- మారనున్న పథకాల పేర్లు

ప్రొద్దుటూరు టౌన్, జూన్ 13: వేసవి సెలవుల తర్వాత గురువారం పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి. ఉదయం 9 గంటలకే కొందరు విద్యార్థులు ఉత్సాహంగా పాఠశాలలకు చేరుకోగా మరికొందరు విద్యార్థులు తొలిరోజే గైర్హాజరయ్యారు. మండలంలో 112 ప్రభుత్వ, మున్సిపల్, జడ్పీ, ఎయిడెడ్ పాఠశాలలున్నాయి. తొలిరోజు కొత్తగా పాఠశాలలో చేరే విద్యార్థులతో ప్రధానోపాధ్యాయులు బిజీగా ఉన్నారు. మండలంలో విద్యార్థులకోసం 1.50 లక్షల విద్యార్థులకు విద్యాసామగ్రి అందించడానికి విద్యాశాఖాధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. పాఠశాలలు ప్రారంభమవడంతో విద్యార్థులతో పాఠశాలలు కళకళలాడుతున్నాయి.


మొదటిరోజు పాఠశాలకు వచ్చిన విద్యార్థులు

- ప్యాకింగ్ మారిన చిక్కీలు

విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో భాగంగా అందిస్తున్న చిక్కీల ప్యాకింగ్ రంగు మారింది. గత ప్రభుత్వం వైసీపీ జెండా రంగులు, జగన్ బొమ్మతో ఉన్న చిక్కీలను పంపిణీ చేసింది. కొత్తగా అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం చిక్కీల ప్యాకింగ్ రంగును మార్చివేసింది. పాఠశాలలు ప్రారంభమైన మొదటిరోజునే రంగుమారిన ప్యాకింగ్‌తో చిక్కీలను విద్యార్థులకు అందజేశారు. విద్యాశాఖలో అమలవుతున్న వివిధ పథకాల పేర్లను ప్రభుత్వం మార్చనుంది. మధ్యాహ్న భోజన పథకానికి ఉన్న జగనన్న గోరుముద్ద పేరు స్థానంలో సీఎం పోషణగా మార్చనున్నారు. విద్యార్థులకు ఉచితంగా అందించే విద్యాసామగ్రికి ఉన్న జగనన్న విద్యాకానుకను స్టూడెంట్ కిట్‌గా మార్చనున్నారు. తల్లిదండ్రులకు ఇస్తున్న అమ్మఒడిని తల్లికి వందనంగా పేరు మార్చనున్నారు.


మారిన ప్యాకింగ్‌లో చిక్కీలు

APS RTC
టెండరు ప్రకటన
YSR కడప జిల్లా పరిధిలోని వివిధ డిపోలకు సంబంధించిన బస్ స్టేషన్‌లలో స్టాల్స్/ షాపులు, క్యాంటీన్, ఖాళీ స్థలములలో వ్యాపారములు చేసుకొనుటకు సీల్డు టెండర్లు కోరబడుచున్నవి. (1) టెండరు ఫారములు సంబంధిత డిపో మేనేజర్ల వారి కార్యాలయములలో తేది.14-06-2024 నుండి తేది.27-06-2024 వరకు అన్ని ఆఫీసు పనిదినములలో ఉ॥10.30 గం॥ల నుండి సా॥5.00 గం॥ల వరకు అమ్మబడును. (2) పూర్తి చేసిన టెండరు ఫారములు తేది.28-06-2024న ఉ॥10.30 గం॥ల నుండి మ॥2.00 గం॥ల లోపున జిల్లా ప్రజా రవాణా అధికారి వారి కార్యాలయం, కడప నందు ఏర్పాటు చేసిన టెండరు బాక్సు నందు వేయవలెను. అదేరోజు మ.3.00 గం॥లకు టెండరుదారుల సమక్షములో టెండర్లు తెరువబడును. (3) పూర్తి వివరములకు మా వెబ్‌సైట్ :https://apsrtc.ap.gov.in లో tenders ను చూడగలరు. (4) ఎట్టి కారణము చూపకుండా టెండర్లు అంగీకరించుటకు లేదా తిరస్కరించుటకు మరియు రద్దుచేయుటకు APSRTC కి పూర్తి అధికారము కలదు.
నెం. E2/797(03)/2024-DPTO/YSR, తేది:12-06-2024 సం/- జిల్లా ప్రజా రవాణా అధికారి, కడప.

ఆంధ్రజ్యోతి దినపత్రికలో...
ప్రారంభోత్సవం
జన్మదిన శుభాకాంక్షలు
ప్రమాణస్వీకారం
వివాహ మహోత్సవం
ఉద్యోగ విరమణ
విదేశీయానం
స్వదేశాగమనం
ఇప్పుడు ఆంధ్రజ్యోతి దినపత్రిక ద్వారా మీ ఆత్మీయులకు ప్రకటనలతో మరింత చేరువకండి, అందుకు మీ ప్రాంతంలోనే మా ప్రకటనల ప్రతినిధి అందుబాటులో ఉన్నారు సంప్రదించండి.
పొలిటికల్ యాడ్స్
షష్టిపూర్తి మహోత్సవం
సినిమా యాడ్స్
శ్రద్ధాంజలి
లీగల్ యాడ్స్
ప్రభుత్వ ప్రకటనలు
క్లాసిఫైడ్స్
ప్రకటనలపై జి.యస్.టి. 5% అదనం
యూనిట్ కార్యాలయం
సర్వే నెం. 137 & 138/3, చిన్నమాచుపల్లె చెన్నూరు మండలం, కడప.
Cell: 9985411183, 9985411189.
ప్రాంతీయ కార్యాలయాలు :
కడప: Cell : 99854 11192, 99854 10691, 99854 02134
కమలాపురం : 9985411183 ప్రొద్దుటూరు : 9985921354, పులివెందుల : 9985411183
జమ్మలమడుగు : 9985401296 మైదుకూరు : 7989603861 రాజంపేట : 9985411193
రాయచోటి: 9985411183 బద్వేలు: 9985921375 కోడూరు : 9985411183.